Happy Work Anniversary. 1St Year

షణ్ముఖ
# వెలుగు
RNI : APTEL / 2023 / 89152
ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 49 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ గురువారం 13. 02. 2025 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 02 ISSUE : 49 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Thursday 13.02.2025 PAGES : 8 PRICE : 5/-


## కుల గణన సర్వే మళ్ళీ నిర్వహిస్తాం : డిప్యూటీ సీఎం



హైదరాబాద్, **ఎస్.వెలుగు న్యూస్** తెలంగాణ రాష్ట్రంలో మరోసారి కుల గణన సర్వే నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఫిబ్రవరి 16 నుంచి 28వ తేదీ వరకు ఈ సర్వే నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విలేకర్లతో మాట్లాడుతూ.. తెలంగాణలో 3.1 శాతం మంది సర్వేలో పాల్గొన లేదని చెప్పారు. గతంలో నిర్వహించిన సర్వేలో పాల్గొనని వారి కోసమే ఈ సారి నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే కుల గణన సర్వే కోసం టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇక

మిగతా 2 లో

## 42 శాతం రిజర్వేషన్లు పెంచకపోతే యుద్ధమే.. : ఆర్.కృష్ణయ్య



న్యూఢిల్లీ, **ఎస్.వెలుగు న్యూస్** స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం, తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్రకులాలలో పేదలకు 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చినప్పుడు సీలింగ్‌ను సుప్రీంకోర్టు ఎత్తివేసిందని, ఇప్పుడు ఏ సీలింగ్ లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రిజర్వేషన్లు పెంచేందుకు అసెంబ్లీలో చట్టం చేయాలని, లేదంటే యుద్ధం తప్పదని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లను పెంచకుండా పార్టీ పరంగా టికెట్లు ఇస్తామని సీఎం రేవంత్ ప్రకటించడం బీసీలను మోసం చేయడమేనని

మిగతా 2 లో

## దక్షిణాది రాష్ట్రాల ఆలయాల సందర్శన... నా వ్యక్తిగత అంశం : పవన్ కల్యాణ్



అమరావతి, **ఎస్.వెలుగు న్యూస్** ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దక్షిణాది రాష్ట్రాల్లోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రాల సందర్శనకు బయల్దేరిన సంగతి తెలిసిందే. ఈ ఉదయం కేరళలోని చొట్టనిక్కరలో ఉన్న అగస్త్య ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. దక్షిణాది రాష్ట్రాల ఆలయాల సందర్శన అనేది పూర్తిగా తన వ్యక్తిగత అంశం అని స్పష్టం చేశారు. తన తాజా పర్యటనకు, రాజకీయాలకు సంబంధం లేదని అన్నారు. ఇది వ్యక్తిగత పర్యటన అని, నాలుగున్నరేళ్ల కిందట చెల్లించుకోవాల్సిన మొక్కుల కోసం ఈ పుణ్యక్షేత్రాల

మిగతా 2 లో

## నేచురల్ ఫుడ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని...

# నెంబర్ వన్ చేస్తున్నాం

### : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

గుంటూరు, **ఎస్.వెలుగు న్యూస్** ప్రపంచాన్ని ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) శాసిస్తోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రాబోయే రోజుల్లో డేటానే సంపద అవుతుందని ఆయన పేర్కొన్నారు. హెల్త్‌లో డేటా కింగ్‌గా కిమ్స్ చైర్మన్ బి. భాస్కర్ రావు తయారవుతారని ఆయన స్పష్టం చేశారు. బుధవారం గుంటూరులో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. 2000 ఏడాదిలో కిమ్స్ తొలి ఆసుపత్రిని తాను ప్రారంభించానని ఆయన గుర్తు చేసుకున్నారు. 25 ఏళ్లలో 5 వేల బెడ్స్‌తో ఐదు రాష్ట్రాలకు కిమ్స్ విస్తరించిందని చెప్పారు. క్రమశిక్షణతోనే ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. సంస్థ బాగుండాలంటే.. అందులో పని చేసే వాళ్లు భాగస్వాములు కావాలని ఆయన అభిప్రాయపడ్డారు. 1995లో తాను ఐటీ గురించి చెప్పానన్నారు. ఇప్పుడు ఏఐ గురించి చెబుతున్నానని పేర్కొన్నారు. భవిష్యత్తులో భారతీయులు అద్భుతాలు సృష్టించను న్నారని సీఎం చంద్రబాబు తెలిపారు. జెనిటికల్ పరీక్షలు ద్వారా ఎటువంటి రోగాలు రాబోతున్నాయో కూడా భవిష్యత్తులో తెలియనుందన్నారు. అయితే హెల్త్ కాస్ట్ తగ్గాలని

మిగతా 2 లో



## భారీ అగ్నిప్రమాదం..

# పెద్ద ఎత్తున ఆస్తి నష్టం



విజయవాడ, **ఎస్.వెలుగు న్యూస్** విజయవాడ నగరంలోని సితార గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన జలకన్య ఎగ్జిబిషన్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఎగ్జిబిషన్ పూర్తిగా దగ్ధమైంది. ఈ ఎగ్జిబిషన్‌లో వంట సామాగ్రిలో గ్యాస్ బండలు ఉండడంతో.. అవి సైతం పేలాయి. ఈ ప్రమాదంతో ఈ ఎగ్జిబిషన్ పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు భయంతో పరుగులు తీశారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బందితోపాటు పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. అనంతరం మంటలను అదుపులోకి తీసుకు వచ్చేందుకు అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. ఈ అగ్నిప్రమాదం ఘటనపై విజయవాడ వెస్ట్ డివిజన్ ఏసీపీ ఎన్ఎస్వీకే దుర్గారావుకు ఫోన్ చేసి హోం మంత్రి అనిత ఆరా తీశారు. ఈ ప్రమాదంలో ప్రాణ, ఆస్తి నష్టం ఏమైనా జరిగిందా? అంటూ వివరాలు అడిగి ఆమె తెలుసుకున్నారు. గ్యాస్ సిలిండర్ పేలుడు కారణంగానే మంటలు వ్యాపించాయని.. అయితే వాటిని అదుపులోకి తీసుకు వచ్చామని హోం మంత్రి అనితకు ఆయన వివరించారు. ఈ ప్రమాదం షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిందని.. దాంతో ఎగ్జిబిషన్‌లోని దుకాణాలు దగ్ధమైనాయని మంత్రి అనితకు ఏసీపీ దుర్గారావు తెలియజేశారు. వేసవి ప్రారంభమైన నేపథ్యంలో అగ్ని ప్రమాదాలకు ఆస్కారం లేకుండా వ్యాపారులు

మిగతా 2 లో

## చిరంజీవి ఆ మాటలు... ఏ ఉద్దేశంతో అన్నారో! : యాంకర్ శ్యామల




అమరావతి, **ఎస్.వెలుగు న్యూస్** వైసీపీ అధికార ప్రతినిధి యాంకర్ శ్యామల తాజాగా మెగాస్టార్ చిరంజీవి చేసిన వ్యాఖ్యల పట్ల స్పందించారు. కేవలం కొడుకునే వారసుడు అనడం సబబు కాదని అన్నారు. కూతురిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని వ్యాఖ్యానించారు. "అదే నాకు అర్థం కాలేదు... వారసుడు అంటే కొడుకే అవుతాడా, కూతురు అవదా! ఏమో... మరి మెగాస్టార్ చిరంజీవి గారు ఏ ఉద్దేశంతో అన్నారో నాకు తెలియదు కానీ... వారసుడు అంటే

మిగతా 2 లో

## హామీలను కూటమి ప్రభుత్వం...

# అమలు చేయడంలేదు

### : మాజీ మంత్రి శైలజానాథ్



అనంతపురం, **ఎస్.వెలుగు న్యూస్** సాదరంగా, ప్రేమ పూర్వకంగా వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలోకి తనను ఆహ్వానించిన అందరికి ధన్యవాదాలు

మిగతా 2 లో

## చరిత్రలో ఎప్పుడూ చూడని విధంగా...

# వైసీపీ పాలన సాగింది

**ప్రజల కోసం బటన్లు నొక్కిన మనకే ఈ పరిస్థితి వస్తే...!: జగన్**

**జగన్ 2.0లో ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని హామీ**

**ప్రజలను మోసం చేసిన చంద్రబాబు చీటర్ కాదా? అని ప్రశ్న**



అమరావతి, **ఎస్.వెలుగు న్యూస్** వైసీపీ అధినేత జగన్ వివిధ జిల్లాల నేతలతో సమావేశమవుతున్న సంగతి తెలిసిందే. ఈరోజు ఉమ్మడి గుంటూరు జిల్లా నేతలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2019-24 మధ్య జగన్ 1.0 ప్రభుత్వం నడిచిందని... చరిత్రలో ఎప్పుడూ చూడని విధంగా వైసీపీ పాలన సాగిందని... లంచాలకు తావు లేకుండా రూ. 2.71 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారుల అకౌంట్లలోకి వేశామని తెలిపారు. జగన్ 2.0లో ప్రతి కార్యకర్తకు తోడుగా ఉంటామని... ప్రతి కార్యకర్త ఇంటికి పెద్దన్నగా అండగా ఉంటానని జగన్ చెప్పారు. మరో 25 నుంచి

మిగతా 2 లో



## వైసీపీ చేసే దుష్ప్రచారాన్ని...

# ప్రజలు నమ్మవద్దు

### :మంత్రి కొల్లు రవీంద్ర మాస్ వార్నింగ్

అమరావతి, **ఎస్.వెలుగు న్యూస్** మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి మంత్రి కొల్లు రవీంద్ర వినితులు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీం ద్ర, పల్లా శ్రీనివాస్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. జగన్‌కు ప్రజలు ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని.. ఆయన కేవలం ఎమ్మెల్యే మాత్రమేనని అన్నారు. జగన్ ఎమ్మెల్యే హోదాలో అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని జగన్

మిగతా 2 లో

## మంత్రి లోకేష్ కృషితో ఏపీకి...

# భారీ పెట్టుబడి..

### త్వరలో కార్యకలాపాలు



అమరావతి, **ఎస్.వెలుగు న్యూస్** ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమి తర్వాత చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం కొలువు దీరింది. దీంతో రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి దేశ, విదేశీ కంపెనీలు సైతం రాష్ట్రానికి క్యూ కట్టాయి. కూటమి ప్రభుత్వం

మిగతా 2 లో

# సంపాదకీయం

## ఏమౌతోంది... ఈ మనుషులకు...

ఈ భూమ్మీద అత్యంత క్రూరమైన జంతువుగా మారగలిగేది ఒక్క మనిషి మాత్రమే. రెండు కాళ్లతో పుట్టి నాలుగు కాళ్ల జంతువుగా మారేది మనిషి ఒపాతికేళ్ల కుర్రాడి నుంచి యాభై ఏళ్ల బామ్మదాకా అందరిలో విలనిజం వెర్రితలలు వేస్తోంది నేరాలకు కారణం ఏంటని.. దాని మూలాలను వెతుకుతూ వెళ్తే కనిపిస్తున్న అడ్రస్ 'ఇల్లు'. నానమ్మ కళ్లలో ఆనందం కోసం చెల్లెలి భర్తనే చంపేశారు. వయసుమళ్లిన తరువాత శాంతంగా, ప్రశాంతంగా ఉండాల్సిన నాయనమ్మే.. మనవళ్లకు పగను నూరిపోయడం వల్ల జరిగింది కాదా ఆ ఘోరం..! వంద మంది అమ్మాయిలను అనుభవించడమే లక్ష్యమట. ఆ టార్గెట్ మరిచిపోకుండా ఉండేందుకు ఏకంగా పచ్చబొట్టు పొడిపించుకున్నాడు ఛాతి మీద. హత్య చేయడానికి, అత్యాచారం చేయడానికి, కన్నవాళ్లనే చిదిమేయడానికి, కట్టుకున్నవాళ్లనే అంతమొందించడానికి.. వీటన్నింటికీ కారణాలున్నాయ్. మనిషి మృగంగా ఎప్పుడు, ఎందుకు మారతాడనడానికి కొన్ని లెక్కలున్నాయి.ఆస్తి ఇవ్వలేదని తాతను పొడిచాడు. ఒక్కసారి కాదు 73 సార్లు పొడుస్తూనే ఉన్నాడు కసిగా. తల్లి అని కూడా చూడకుండా అడ్డొచ్చిన ఆమెపైనా కత్తితో పొడిచేశాడు. మనిషిలో మానవత్వం మాయమవుతోందని చెప్పడానికి ఇదే అతిపెద్ద నిదర్శనం. అసలు.. మానవత్వం మానవత్వం అని గొంతుచించుకుంటూ అరుచుకుంటూ వెళ్తున్నాం గానీ.. కనీసం పశుత్వం అయినా మనిషిలో ఉందా అనేదే అనుమానం. భార్యను ముక్కలుముక్కలుగా నరికి, కుక్కర్‌లో ఉడికించి, ఎముకలు పొడి చేసి, చెరువులో పడేశాడట. మనసులో ఎంత పశుత్వం ఉంటే అంత పనిచేయగలడు. మానిప్యులేటర్స్ అనే పదాన్ని ఈమధ్య క్రైమ్‌లో కూడా వాడుతున్నారు. సైకాలజిస్టులు క్యాటగరైజ్ చేసిన సైకో మెంటాలిటీస్.. ఈ మానిప్యులేటర్స్. ఎలా ఉంటారంటే వీళ్లు. మాటలతోనే మత్తుజల్లుతుంటారు.ఎదుటివారిని నమ్మించగలిగినప్పుడే మోసం చేయొచ్చు. అత్యంత దారుణాలు జరిగేది కూడా నమ్మిన వాళ్ల దగ్గరే. ఇంజనీరింగ్ సెకండ్ ఇయర్ చదువుతున్న ఓ అమ్మాయిని.. తనపై నమ్మకం పెరిగేంతగా నటించాడు ఓ యువకుడు. ఇంట్లో ఫంక్షన్ ఉందని చెప్పి, ఆ అమ్మాయిని రప్పించాడు. ఇంట్లో ఫంక్షన్ జరగడం లేదని తెలిసినా సరే.. అక్కడే తన కాలేజ్‌లో చదువుతున్న మరో యువకుడిని చూసి ఏం కాదులే అని నమ్మిందా అభాగ్యురాలు. ఆ నమ్మకమే, అలా నమ్మడం వల్లే ఆ తరువాత నరకం చూసింది. పిలిచిన వ్యక్తి ప్లస్ ఆ తోటి విద్యార్థి.. ఇద్దరూ బయట కాపలాగా ఉంటే.. మూడో వ్యక్తి వచ్చి అత్యాచారం చేశాడు. పైగా ఆ అరుపులు బయటకు వినించకుండా సౌండ్ బాక్సులు పెట్టారట. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం పరిటాలలో జరిగిందీ దారుణం.ఆడపిల్లల జీవితాలతో మస్తాన్ సాయి ఆడుకుంటూపోయాడని చెబుతున్నారు మానసిక వైద్యులు. ప్రభాకర్ అనే సైకోమెంటాలిటీ ఉన్నవాడిని ఈ మధ్యే చూశాం. వంద మంది అమ్మాయిలే టార్గెట్ అట. ఎంత మానిప్యులేటర్ కాకపోతే.. అంతమందిని లక్ష్యంగా పెట్టుకుంటాడు. మాటలు, మంచితనాన్ని అడ్డుపెట్టి ఎంతమంది అమ్మాయిలను నమ్మించి మోసం చేసి ఉంటాడు. మీర్‌పేటలో భార్యను కిరాతకంగా చంపిన గురుమూర్తినే చూడండి. ఆ చుట్టుపక్కల ఎవరిని అడిగినా సరే.. 'అరె.. అతను చాలా మంచివాడే, ఇలా ఎలా చేశాడు, అసలు అంత దారుణమైన పని చేస్తాడని ఊహించనే లేదు' అనే చెప్పారంతా. హీ ఈజ్ ఆల్సో ఏ వెరీ గుడ్ మానిప్యులేటర్.ఇదనే కాదు.. చిన్న పిల్లలపై, మైనర్లపై అఘాయిత్యాలు చేసేది అలా నమ్మించే వాళ్లే. అన్న కదా, అక్కా అని పిలిచాడు కదా, బాబాయ్, పెదనాన్న, తాతే కదా అని నమ్మకంతో వెళ్లినందుకు ఎంతమంది ఆడపిల్లలు బలైపోతున్నారో. ఆ పశుప్రవృత్తికి కారణం.. 'విషయం బయటకు తెలిస్తే తమ పరువే పోతుందని స్వయంగా తల్లిదండ్రులే భయపడడం'. కామాంధుల బలం కూడా అదే. బయటకు చెప్పుకోలేరు అనే అస్త్రాన్ని ప్రయోగించి.. అయినవాళ్లనే, వావివరసలు మరిచి ప్రవర్తిస్తుంటారు. కొన్ని గణాంకాలు కూడా ఉన్నాయ్. ఎన్సీఆర్బీ-2016 రిపోర్ట్ ప్రకారం మైనర్ బాలికలపై జరిగిన అత్యాచార కేసుల్లో.. 94 శాతం దోషులు ఆ కుటుంబానికి బాగా తెలిసిన వాళ్లు, దగ్గర వాళ్లే. ఆ దోషులలో 29 శాతం మంది ఇరుగుపొరుగు వాళ్లు, 27 శాతం పెళ్లి చేసుకుంటామని హామీ ఇచ్చిన వాళ్లు, 6 శాతం బంధువులు, మిగతా 30 శాతం ఆ కుటుంబానికి చాలా దగ్గరగా ఉండేవాళ్లు. సో, ఒక్కోసారి నమ్మకమే ప్రమాదకరం. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో ఇద్దరు పసిపిల్లలను కొట్టిన తీరు చూసి.. వైద్యం చేసిన డాక్టర్లే కన్నీళ్లు పెట్టుకున్నారు. అంతలా కొట్టడానికి మనసెలా వచ్చిందని. పిల్లల్ని అలా కొట్టడానికి కారణం ఏంటో తెలుసా. వివాహేతర సంబంధం. తన వ్యవహారానికి పిల్లలు అడ్డొస్తున్నారని ఫోన్ ఛార్జర్ వైర్‌తో కొడుతుంటే.. చర్మం చిరిగిపోయి, రక్తం బయటకు చిమ్మింది. అక్కడితో ఆగలేదు. ఆ గాయాలపై కారం పూశారట. 9 ఏళ్ల బాలుడు అనుభవించిన టార్చర్ వింటే ఎవరికైనా కన్నీళ్లొస్తాయ్. ఆ బాలుడి చెల్లెలు.. వయసు ఐదేళ్లుంటాయి.. ఆ చిన్నారిని కూడా వాతలు తేలేలా కొట్టాడు. ఆ అడ్డమైన సంబంధానికి పిల్లలు అడ్డొస్తున్నారన్న కోపంతో చేసిన దుర్మార్గం ఇది.జాతివైరాన్ని మరిచిన జంతువులు' అని ఒక్కోసారి కొన్ని వీడియోలు చూస్తుంటాం. లేడిపిల్ల దగ్గరకు వచ్చినా సరే పులి ఏమీ చేయకుండా దాన్ని నాకుతూ ఉంటుంది ఆప్యాయంగా. అలాంటిది కడుపున పుట్టిన వారినే దయా దాక్షిణ్యాలు లేకుండా ప్రవర్తిస్తున్న తల్లిదండ్రులున్నారు. 14 ఏళ్ల కొడుకుపై పిడిగుద్దులు కురిపించాడో తండ్రి. ఛాతిపై తట్టుకోలేనంత తీవ్రతతో పిడికిలి బిగించి మరీ బాదాడు. అంత దెబ్బ తగిలితే పిల్లాడు ఉంటాడా. అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఇంత దారుణంగా ప్రవర్తించడానికి కారణం.. తన కొడుకు రాత్రి 8 అయినా ఇంటికి రాకపోవడం. 'నాన్నా స్కూల్లో ఫేర్‌వెల్ పార్టీ జరిగింది.. కాస్త ఆలస్యం అయింది' అని చెబుతున్నా వినకుండా కొట్టడంతో తొమ్మిదో తరగతి చదివే ఆ బాలుడు అక్కడికక్కడే చనిపోయాడు. యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో జరిగిందిది. తెలంగాణనే చూద్దాం. ఒక్క ఏడాదిలోనే కుటుంబ కలహాలతో 229 హత్యలు జరిగాయి. వివాహేతర సంబంధాల కారణంగా 102 హత్యలు, చిన్నచిన్న గొడవల కారణంగా 82, ఆర్థిక వివాదాలతో 53 హత్యలు జరిగాయి. గతేడాది మహిళలపై జరిగిన నేరాలే.. 19వేల 922. వీటిలో సగం వరకట్న వేధింపులే. ఇక అత్యాచార కేసులలో 99.2 శాతం నిందితులు బాధితులకు తెలిసినవారే చేశారంటున్నారు తెలంగాణ పోలీసులు.ఓవైపు.. కఠిన శిక్షలు ఉన్నా, మరణశిక్షలు విధిస్తున్నా సరే.. ఈ అత్యాచారాలు మాత్రం ఆగడం లేదు. 2012లో నిర్భయ ఘటన జరిగాక.. అత్యాచారాలకు అత్యధికంగా మరణశిక్ష కూడా విధించొచ్చు అంటూ చట్టంలో మార్పులు చేశారు. ఈ శిక్షతో నేరస్తులు భయపడిపోతారని అనుకున్నారంతా. కానీ జరిగిందేమిటో తెలుసా. 2015లో 34వేల 651 అత్యాచార కేసులు, 2016లో 38వేల 947 అత్యాచార కేసులు రిజిస్టర్ అయ్యాయి. 2012లో.. అంటే నిర్భయ ఘటన జరిగిన ఏడాదిలో.. 24వేల 923 సంఘటనలే జరిగాయి. అంటే.. ఉరిశిక్ష పడుతుందన్న భయం కూడా లేదని తేలిపోయింది. పైగా ఇలా అత్యాచార బాధితుల్లో ఎక్కువగా పిల్లలే ఉన్నారు. పోక్సో లాంటి పవర్‌ఫుల్ చట్టం ఉన్నప్పటికీ.. కేవలం 3 శాతం కేసులలో మాత్రమే నేరాలుగా నిరూపించగలిగారు. ఔఅఖీః రిపోర్ట్ ప్రకారం.. 2016లో పిల్లలపై అత్యాచారాలకు సంబంధించి 64వేల 138 కేసులు పోక్సో చట్టం కింద నమోదైతే.. కేవలం 3 శాతం కేసులనే నిరూపించగలిగారు. నేరమే నిరూపించలేకపోయినప్పుడు ఎవరిని ఉరి తీస్తారు?వీటన్నింటికీ కారణం ఏంటని అడిగితే.. కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం అవడమే అనే సమాధానమే ప్రధానంగా వినిపిస్తోంది. పిల్లల్ని పెంచే పద్ధతిలోనే ఏదో లోపం జరుగుతోంది. అటుపైన ప్రతి ఇంట్లోకి వేగంగా దూసుకొచ్చిన ఇంటర్నెట్. ఏ నేరం ఎలా చేయాలో, ఎలా చేస్తే తప్పించుకోవచ్చో చెప్పే సినిమాలు సెల్‌ఫోన్ నిండా ఉన్నప్పుడు.. టెస్టోస్టెరాన్ స్థాయిని పెంచే ఘాటైన వీడియోలు కళ్లముందే కదలాడుతున్నప్పుడు.. ఇక నేరాలు జరక్కుండా ఉంటాయా? అయినా లోపం.. ఇంటర్నెట్‌తో, రెచ్చగొట్టే వీడియోలది మాత్రమే కాదు. సమాజాన్ని ముందుకు తీసుకెళ్తున్న తీరులోనే లోపం ఉంది. యూరప్‌లోని కొన్ని దేశాల్లో జైళ్లనే ఎత్తేశారు. కారణం.. అక్కడ నేరాలు జరక్కపోవడమే. అంటే ఏంటీ అర్థం. మనిషి సంతృప్తిగా జీవించినప్పుడు, ఆ మనిషి సంతృప్తికరంగా జీవించేలా ప్రభుత్వాలు సమాజాన్ని నిర్మించినప్పుడు మాత్రమే నేరాల కట్టడి సాధ్యం. ఉరివేయాలి, మెడలు కోయాలి, బహిరంగంగా తగలబెట్టాలి.. ఇలాంటి శిక్షలు సైతం మనిషిని మార్చలేవు. సో, సమాజం మారాలంటే.. అటు ప్రభుత్వాలు కూడా జీడీపీ ఆధారంగా కాకుండా హ్యాపీనెస్ ఇండెక్స్ కొలమానంగా పాలించాలంటున్నారు విశ్లేషకులు. మరి.. అలాంటి రోజులు ఎప్పుడొస్తాయో, ఎప్పుడు చూస్తామో..!

## చరిత్రలో ఎప్పుడూ చూడని విధంగా...

30 ఏళ్లు తాను రాజకీయాల్లో ఉంటానని తెలిపారు. వైసీపీ పాలనలో రెండేళ్లు కోవిడ్ ఉందని... అందుకే కార్యకర్తలకు చేయాల్సింది చేయలేకపోయామని చెప్పారు. టీడీపీ నేతలు గ్రామాల్లోకి, ఇంటింటికి వెళ్లే పరిస్థితి లేదని జగన్ అన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ అని చెప్పుకున్నారని... ఇప్పుడు అది బాబు షూరిటీ-మోసం గ్యారంటీ అయిందని చెప్పారు. రాష్ట్రంలో స్కామ్ లు తప్ప మరేమీ జరగడం లేదని అన్నారు. దోచుకోవడం, పంచుకోవడం, దాచుకోవడం తప్ప మరేమీ లేదని విమర్శించారు. యథేచ్ఛగా పేకాట క్లబ్ లు నడుస్తున్నాయని, ఇసుక, లిక్కర్ స్కాంలు చేస్తున్నారని మండిపడ్డారు. చట్టవిరుద్ధంగా వ్యవహరించేవారిని, అన్యాయాలు చేసేవారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని వార్నింగ్ ఇచ్చారు. తప్పు చేసిన వారిని చట్టం ముందు నిలబెడతామని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో మరిన్ని దొంగ కేసులు పెడతారని, అరెస్ట్ లు చేస్తారని అన్నారు. రాబోయే మన ప్రభుత్వంలో అందరికీ దగ్గరుండి మేలు చేస్తానని జగన్ చెప్పారు. మొన్నటి స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ రెండే మున్సిపాలిటీలు గెలిచిందని... మనం గట్టిగా తుమ్మి ఉంటే ఆ రెండు కూడా పోయేవని చెప్పారు. ఇప్పుడు టీడీపీ తప్పుడు సంప్రదాయాలకు పాల్పడుతోందని అన్నారు. ప్రజలను మోసం చేసిన చంద్రబాబు చీటర్ కాదా? ఆయనపై 420 కేసు పెట్టకూడదా? అని ప్రశ్నించారు. మొన్నటి ఎన్నికల్లో వైసీపీకి 40 శాతం ఓట్లు వచ్చాయని... 10 శాతం ఓట్లు తగ్గడానికి కారణం తాను వాళ్ల మాదిరి అబద్ధాలు చెప్పకపోవడమేనని అన్నారు. ప్రజల కోసం బటన్లు నొక్కిన మనకే ఈ పరిస్థితి వస్తే... ప్రజలను మోసం చేసి, ఇచ్చిన మాటను గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వంలోని వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. మళ్లీ రాబోయేది మన ప్రభుత్వమేనని, అందరూ ధైర్యంగా ఉండాలని చెప్పారు.

## నేచురల్ ఫుడ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని...

ఆయన పేర్కొన్నారు. ఆయుష్మాన్ భవలో భాగస్వాములమవుతామన్నారు. నేచురల్ ఫుడ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నెంబర్ వన్ చేస్తున్నామని చెప్పారు. దేశంలో ఉత్పత్తి అయ్యే గ్రీన్ ఎనర్జీలో 1/3 ఏపీలో చేయబోతున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఎలక్ట్రిక్ వెహికిల్స్ వాడే రోజు రావాలని ఆయన ఆకాంక్షించారు. ఇక వాట్సాప్‌లోనే అన్ని సర్టిఫికేట్స్ పొందవచ్చునని చెప్పారు. వివిధ రంగంలో స్కిల్ డెవలప్‌మెంట్ చేయడానికి ముందుకొచ్చే వారికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన తెలిపారు. సమర్థవంతమైన నాయకుడు, సుస్థిరపాలన ఉంటే అభివృద్ధి ఉంటుందన్నారు. 2019లో తెలుగు దేశం పార్టీ గెలిచి ఉంటే ఇంత విధ్వంసం జరిగి ఉండేదా? అని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా ప్రశ్నించారు. ప్రాధాన్యత తెలియని వ్యక్తులు పాలన చేస్తే.. ఎలా ఉంటుందో ఎయిమ్స్‌కి నీళ్లు ఇవ్వలేకపోవడమే అందుకు నిదర్శమని ఆయన పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో 300 పడకలతో స్పెషాలిటీ హాస్పటల్ ఏర్పాటు చేసే దిశగా తాము ఆలోచన చేస్తున్నమని చెప్పారు.పేదలకు అందుబాటులో మెరుగైన పాలన ఇచ్చేలా తాము ముందుకెళ్తున్నామని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. 15 శాతం ఆర్థిక వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన వివరించారు. రాబోయే బడ్జెట్‌ను అందుకు అనుగుణంగా రూపకల్పన చేస్తున్నమని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు.

## మంత్రి లోకేష్ కృషితో ఏపీకి...

తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఇప్పటికే పలు కంపెనీలు రాష్ట్రంలో ఏర్పాటు చేయడానికి సీఎం చంద్రబాబుతో ఒప్పందాలు చేసుకున్నాయి. అలాగే జగన్ ప్రభుత్వ హయాంలో ఏపీ నుంచి లూలు సంస్థ వెళ్లిపోయింది. ఆ సంస్థ సైతం మళ్లీ ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి అంగీకారం తెలిపింది.

**విశాఖలో పెట్టుబడులకు సిద్ధం.. :** ఇవేగాకుండా టాటా సంస్థతోపాటు పలు ప్రముఖ ఐటీ కంపెనీలు కూడా ఏపీలో తమ సంస్థలను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చాయి. అయితే తాజాగా ఏపీ మంత్రి నారా లోకేష్‌ను ఫార్చ్యూన్ 500 కంపెనీ సిఫీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజు వేగేశ్న బుధవారం కలిశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని మంత్రి లోకేష్ ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి సిఫీ ఛైర్మెన్ రాజు వేగేశ్న సుముఖత వ్యక్తం చేశారు. విశాఖలో మెగా డేటా సెంటర్, కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ ఏర్పాటుపై నారా లోకేష్ చర్చించారు. ఏపీలో పెట్టుబడులకు ప్రస్తుత అవకాశాలను మంత్రి లోకేష్ వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న సేవలపై వివరణ ఇచ్చారు. నూతనంగా తీసుకువచ్చిన ఐటీ పాలసీల గురించి లోకేష్ ప్రస్తావించారు.

**యువతకు ఉపాధి లేక అవస్థలు..**కాగా, వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క పరిశ్రమ కూడా రాష్ట్రానికి రాకపోవడంతో ఇక్కడి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరకలేదు. దీంతో యువత చాలా నష్టపోయింది. గత జగన్ ప్రభుత్వ అనాలోచిత చర్యలతో లూలూ సంస్థ కూడా ఏపీ నుంచి పొరుగు రాష్ట్రాలకు వెళ్లిపోయింది. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు కాకపోవడంతో.. ఉపాధి కోసం యువత దేశంలోని వివిధ రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రజలు గ్రహించారు. అందుకే.. ఈ ఏడాది మేలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమికి పట్టం కట్టారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి, పరిశ్రమల ఏర్పాటుకు దేశవిదేశీ సంస్థలు క్యూ కడుతున్నాయి.

# టాలీవుడ్ పై పైరసి భూతం

హైదరాబాద్ : టాలీవుడ్ ను పైరసీ భూతం వెంటాడుతోంది. ఏ సినిమా అయినా...థియేటర్లలో విడుదలైన గంటల వ్యవధిలో ఆన్ లైన్ లో దర్శనం ఇస్తుంది. పవన్ కల్యాణ్ అత్తారింటికి దారేది చిత్రం నుంచి తాజాగా విడుదలైన తండేల్ వరకు ఎన్నో చిత్రాలు పైరసీ బారిన పడినవే. వందల కోట్లు పెట్టుబడిగా పెట్టి వందల వంది టెక్నీషియన్లతో నెలల పాటు తీసిన చిత్ర బృందం కష్టాన్ని గంటల వ్యవధిలో బూడిదపాలు చేస్తున్నారు. పైరసీ వెబ్ సైట్స్, ఫ్యాన్స్ వార్...ఇలా కారణాలు ఏమైనా చివరికి నష్టపోయేది సినిమా నిర్మాతలే.పైరసీ భూతాన్ని అరికట్టేందుకు కఠిన చట్టాలు ఉన్నా...ఎంత వరకూ ఆచరణలో ఉన్నాయన్నదే పెద్ద ప్రశ్న. ఎంత మంది నిందితులను చట్టం ముందు నిలబెట్టారనే ప్రశ్నలు తలెత్తు?తున్నాయి. టెక్నాలజీ సాయంతో రెచ్చిపోతున్న పైరసీ కేటుగాళ్లకు అడ్డుకట్ట వేయలేమా? అనే సందేహాలు మరోసారి చర్చనీయాంశం అవుతున్నాయిహీరో నాగచైతన్య, హీరోయిన్ సాయిపల్లవి నటించిన రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'తండేల్' సినిమాను పైరసీ భూతం వెంటాడుతోంది. ఈ సినిమా విడుదలైన రెండు రోజుల్లోనే ఏపీఎస్ఆర్టీసీ బస్సులో ప్రదర్శించడం తీవ్ర చర్చనీయాంశమైంది. చిత్ర నిర్మాత బన్నివాసు స్పందిస్తూ... ఈ ఘటనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఛైర్మన్‌ను విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ ఘటనపై ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు విచారణకు ఆదేశించారు.ఏపీఎస్ఆర్టీసీ బస్సులో తండేల్ సినిమ పైరసీ ప్రింట్ ప్రదర్శించడం దారుణమని నిర్మాత బన్నీవాసు ఆవేదన చెందారు. చిత్ర విజయానికి పైరసీ ఆటంకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు తెలిసి, మరికొందరు తెలియక ఇలాంటి తప్పులు చేస్తున్నారన్నారు. వాట్సప్, టెలిగ్రామ్ గ్రూప్స్‌లో పైరసీ లింక్స్‌ను ఫార్వర్డ్ చేస్తున్నారని అన్నారు. పైరసీ చేస్తున్న వారిని, దాన్ని ప్రోత్సహిస్తున్న వారిని గుర్తించి కేసులు పెడుతున్నామని, వాళ్లంతా జైలుకు వెళ్లే అవకాశముందని నిర్మాత బన్నీ వాసు హెచ్చరించారు.ఫిల్మ్ ఛాంబర్ చర్యలతో కొన్ని ఏళ్లుగా సినిమా పైరసీ జరగడం లేదని, ఇటీవల కాలంలో మళ్లీ ఈ రాక్షసి విరుచుకుపడుతోందని నిర్మాత బన్నీ వాసు ఆవేదన వ్యక్తం చేశారు. గేమ్‌ఛేంజర్ సినిమా కూడా ఆన్‌లైన్‌లో విడుదల చేశారన్నారు. చాలా ప్రయత్నాలు చేసి ఆన్ లైన్ లింక్‌లు తొలగించినట్లుగా చెప్పారు. పైరసీపై పోరాటం చేసేందుకు ఫిల్మ్ ఛాంబర్‌లో ప్రత్యేకమైన సెల్ ఏర్పాటు చేశామన్నారు. వాళ్లు పగలూ రాత్రి పైరసీపై నియంత్రణకు పని చేస్తుంటారన్నారు.హీరో రామ్ చరణ్ నటించిన 'గేమ్ ఛేంజర్' సినిమాను ఏపీలోని కొన్ని కేబుల్ టీవీ ఛానెల్స్‌లో పైరసీగా ప్రసారం చేశారు. సినిమా నిర్మాతలకు తీవ్ర నష్టం కలిగేలా లోకల్ టీవీ ఛానెల్స్‌లో హెచ్‌డీ ప్రింట్‌ను ప్రసారం చేశారు. ఈ సినిమా పైరసీ కాపీ ప్రసారం చేసిన కేబుల్ ఆపరేటర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. సినిమా వెనక కొన్ని వేల మంది శ్రమ దాగి ఉంటుందని నిర్మాతలు ఆవేదన చెందుతున్నారు. ఇటీవల కాలంలో సోషల్ మీడియా విచ్చలవిడితనంలో ఫ్యాన్స్ వార్ పేరిట ఇష్టారీతిన ప్రవర్తిస్తున్నారు. ఎవరో ఒక హీరో పేరు, ఫోటోతో సోషల్ మీడియా ఖాతా తెరిచి నిత్యం వివాదాస్పదత వ్యాఖ్యలు, వీడియోలు పోస్టు చేస్తున్నారు. దీంతో పాటు కొత్త సినిమాలు విడుదల సమయంలో సినిమాల్లోని కీలక అంశాల వీడియోలు సోషల్ మీడియాలో పెడుతున్నారు. ఫ్యాన్స్ వార్ పేరిట పైరసీ కాపీలను ప్రోత్సహిస్తు?న్నారు. థియేటర్లలోనే నేరుగా సెల్ ఫోన్లలో వీడియోలు రికార్డు చేస్తూ సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టు చేస్తున్నారు. ఫ్యాన్ వార్ లో హెచ్డీ ప్రింట్ లు సోషల్ మీడియాలో లీక్ చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్న సందర్భాలు ఉన్నాయి.పైరసీ కారణంగా ప్రతి ఏడాది వినోద రంగానికి రూ.20 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లుతోందని 2023లో ఓ నివేదిక తెలిపింది. సినిమా నిర్మాణానికి పడిన కష్టం పైరసీ వల్ల వృథాగా పోతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పైరసీని అడ్డుకోవడానికి కేంద్ర ప్రసార, సమాచార మంత్రిత్వ శాఖలో నోడల్ ఆఫీసర్స్‌ను నియమించారు. అలాగే ఇటీవల సినిమాటోగ్రఫీ చట్టం 1952లో సవరణలు చేసి, కొత్త బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఈ బిల్లులో పైరసీని అరకట్టడం అనేది ఓ ప్రధానాంశం. ముంబయిలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ కార్యాలయంలో, ప్రాంతీయ కార్యాలయాల్లో పైరసీ, డిజిటల్ పైరసీల ఫిర్యాదులను స్వీకరిస్తారు.డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో ఉన్న పైరసీ కంటెంట్‌పై నోడల్ అధికారులకు ఫిర్యాదు చేస్తే 48 గంటల్లో ఆ కంటెంట్‌ను డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ నుంచి తొలగించేలా సీబీఎఫ్సీ అధికారులు చర్యలు చేపడతారు. సినిమాలను అనధికారికంగా రికార్డ్ చేయడం, అనుమతి లేకుండా బహిరంగంగా ప్రదర్శించడం, ఆన్‌లైన్‌లో, సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయడం తీవ్రమైన నేరంగా సినిమాటోగ్రఫీ చట్టం ప్రకారం పరిగణిస్తారు.ఈ నిబంధనలను అతిక్రమించిన వారికి మూడు నెలల నుంచి మూడేండ్ల పాటు జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుంది. దీంతో పాటు సినిమా నిర్మాణ వ్యయంలో 5 శాతాన్ని నిందితులు జరిమానాగా కట్టాల్సి ఉంటుంది. సినిమాకు సంబంధించిన కొద్ది భాగాన్ని కూడా పైరసీ చేయడం శిక్షార్హమే.అయితే కేంద్ర ప్రభుత్వం పాటు రాష్ట్ర ప్రభుత్వాలు పైరసీపై కఠిన చర్యలు తీసుకోవాలని టాలీవుడ్ వర్గాలు కోరుతున్నాయి. పైరసీపై చట్టాలను మరింత కఠినం చేసి బాధ్యులకు త్వరగా శిక్షలు పడేలా చేస్తే...భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు తగ్గుతాయని అభిప్రాయపడుతున్నారు.

## ఢిల్లీ కాంగ్రెస్ కు ఏమైంది...

న్యూఢిల్లీ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ జెండా ఎగిరింది. 12 ఏళ్లుగా ఢిల్లీని పాలించిన ఆప్.. ప్రతిపక్ష పాత్రకు పరిమితమైంది. ఎటొచ్చి ఈ ఎన్నికలు మరోసారి కాంగ్రెస్‌కు తీవ్ర నిరాశను మిగిల్చాయి. ఢిల్లీ ఎన్నికల్లో ప్రధాన పోటీ ఆప్, బీజేపీ మధ్యే ఉంటుందని మొదటి నుంచి అంతా భావించారు. అయితే ఒకప్పుడు ఢిల్లీ ఎన్నికల్లో వరుస విజయాలు సాధించిన కాంగ్రెస్.. ఈసారి ఏమైనా ఊహించని ఫలితాలు సాధిస్తుందేమో అని ఆ పార్టీ నేతలు, శ్రేణులు ఆశపడ్డాయి. కానీ అలా ఆశించిన వారికి మరోసారి నిరాశ తప్పలేదు.పూర్వ వైభవాన్ని చాటుకునే పరిస్థితులు లేకున్నా, కనీస 10 స్థానాలనైనా గెలుచుకునేలా చివరి దశ ప్రచారాన్ని ముమ్మరం చేసింది. పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, మల్లికార్జున ఖర్గేలు విస్తృత ప్రచారం నిర్వహించారు. కానీ గతంతో పోల్చితే కొద్దిగా ఓట్ల శాతం పెరగడం మినహా ఆ పార్టీకి సంతృప్తినిచ్చిన అంశం ఇంకొకటి లేదనే చెప్పాలి.1998 నుంచి 2013 వరకు వరుసగా 15 ఏళ్లపాటు ఢిల్లీని కాంగ్రెస్ పాలించింది. అందుకే ప్రస్తుత ఎన్నికల్లో కనీస ఖాతా తెరవాలని గట్టి పట్టుదలగా వ్యవహరించింది. 2008లో 48శాతం ఓట్లతో 43 సీట్లు సాధించుకున్న కాంగ్రెస్ పార్టీ 2013లో 24.70 శాతం సీట్లతో 7 సీట్లకు పరిమితమైంది. తర్వాత 2015 ఎన్నికల్లో 9.7 శాతం, 2020లో 4.3 శాతం ఓట్లు రాగా ఒక్క సీటును గెలవలేదు.అయితే మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో ఢిల్లీలో కాంగ్రెస్‌కు 18శాతం ఓట్లు వచ్చాయి. ఈసారి దాన్ని కాస్త పెంచుకున్నా 5 నుంచి 10 స్థానాలు గెలువచ్చని లెక్కలు వేసుకుంది. అయితే ఆప్‌తో పొత్తు లేకపోవడం, ప్రధాన పోటీ మొత్తంగా బీజేపీ, ఆప్‌ల మధ్యే కొనసాగుతుండటంతో కాంగ్రెస్‌ను పట్టించుకునే వారే కరువయ్యారు. ఢిల్లీని పట్టి పీడిస్తున్న యమునా నది కాలుష్య అంశాన్ని రాజకీయ అస్త్రంగా మలుచుకునేందుకు రాహుల్‌గాంధీ స్వయంగా యమునాలో బోటులో పర్యటించారు. అయితే అది పెద్దగా ప్రభావం చూపలేదని ఫలితాల సరళిని బట్టి అర్థమవుతోంది.ఢిల్లీని ప్రధాని మోదీ, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ మొత్తంగా నాశనం చేశారని ఎన్నికల ప్రచారంలో ఆరోపించింది కాంగ్రెస్. లిక్కర్ మాఫియాలో ఆప్ పెద్దలు కూరుకుపోయిరని, శీష్ మహల్‌లో కేజ్రీవాల్ విలాసవంతమైన జీవితాన్ని గడిపారంటూ టార్గెట్ చేసింది. ఇక ఇతర రాష్ట్రాల్లో ఇచ్చిన విధంగానే గ్యారంటీ అమలును ఢిల్లీలోనూ ప్రకటించింది.

## చిరంజీవి ఆ మాటలు...

కొడుకులే అవ్వాలి అనే ఒక ఆలోచన నుంచి అందరూ బయటికొస్తే బాగుంటుంది. మహిళలు ఇంత అభివృద్ధి చెందుతూ, ఇంత ముందుకు నడుస్తున్న ఈ రోజుల్లో కూడా ఇలాంటి ఆలోచనలు సరికాదు. వాళ్లింట్లో వాళ్ల కోడలు ఉపాసన గారినే చూస్తే... ఓ డైనమిక్ లేడీ, డైనమిక్ ఉమన్.... ఓ సంస్థను ఆమె ఎంత చక్కగా నడిపిస్తున్నారో తెలిసిందే కదా. ఉపాసన వాళ్ల మదర్ కానీ, వాళ్ల సిస్టర్స్ కానీ ఎంత ఎదిగారో తెలిసిందే. అందుకే, వారసుడు అంటే ఎవరైనా అవ్వొచ్చు... కొడుకే అవ్వక్కర్లేదు... అనేది నా అభిప్రాయం. చిరంజీవి గారు ఏ ఉద్దేశంతో అన్నారో నాకు తెలియదు" అని శ్యామల వివరించారు.

## దక్షిణాది రాష్ట్రాల ఆలయాల సందర్శన...

సందర్శనకు వచ్చానని పవన్ కల్యాణ్ వెల్లడించారు. తన ఆరోగ్యం సహకరించకున్నా వచ్చానని తెలిపారు. కాగా, ఈ ఆధ్యాత్మిక పర్యటనలో పవన్ వెంట ఆయన తనయుడు అకిరా నందన్, సన్నిహితుడు, టీటీడీ బోర్డు మెంబర్ ఆనంద్ సాయి కూడా ఉన్నారు.

## హామీలను కూటమి ప్రభుత్వం...

అంటూ మాజీ మంత్రి శైలజానాథ్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన అనంతపురంలో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్డీయే ప్రభుత్వం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వారిని ఎదురించడానికే వైఎస్సార్‌సీపీలో చేరినట్లు చెప్పారు. వైయస్ రాజశేఖర రెడ్డి, ఆ కుటుంబం అంటే తనకు ఆరాధన భావం ఉందని.. అన్న, చెల్లెల్ల మధ్య జరుగుతున్న వివాదం ముగిసిపోవాలని తాను కోరుకుంటున్నానని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకం, శాంతి భద్రతలపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బాధ్యత తీసుకోవాలని,, యాత్రల పేరుతో డిప్యూటీ సీఎం తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని శైలజానాథ్ అన్నారు. సూపర్ సిక్స్ హామీలను చూసి ప్రజలు ఎన్డీయేకు అధికారం ఇచ్చారని, హామీలు ఇచ్చేటప్పుడు సీఎం చంద్రబాబుకు తెలియదా.. అని ప్రశ్నించారు. ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం ఇవ్వడానికి చంద్రబాబు మనసుకు కష్టంగా ఉంటుందని, ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, క్షమాపణలు చెబితే సరిపోదని అన్నారు. ఏపీలో శాంతి భద్రతల గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మేలని శైలజానాథ్ వ్యాఖ్యానించారు. కాగా ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ ఈ నెల 7వ తేదీ (శుక్రవారం) వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆ పార్టీ అధ్యక్షుడు తాడేపల్లిప్యాలెస్‌లో శైలజానాథ్‌కు కండువా కప్పి, ఆలింగనం చేసుకొని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఆ సమయంలో ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తదితరులు ఉన్నారు. ఎన్నికలకు ముందే శైలజానాథ్ పార్టీ మారతారంటూ ప్రచారం జరిగింది. ఆ సమయంలో ప్రాంతీయ పార్టీల్లో చేరినా టికెట్ దక్కే పరిస్థితి లేకపోవడంతో మౌనంగా ఉండిపోయారు. ఇప్పుడు వైసీపీలో చేరారు. జగన్ నాయకత్వంలో పని చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని శైలజానాథ్ చెప్పారు. హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రజల తరపున వైసీపీ పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. దివంతగత రాజశేఖర్ రెడ్డి ప్రోత్సహించిన కారణంగానే శైలజానాథ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. తొలిసారిగా 2004లో ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్న ఆయన మొదటి సారి పోటీ చేసి గెలిచారు. 2009లో మళ్లీ గెలుపొందారు. కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. విభజన తర్వాత నుంచి కూడా శైలజానాథ్ కాంగ్రెస్ పార్టీతోనే అంటకాగుతున్నారు. ఆ క్రమంలో జగన్ ఆహ్వానం మేరకు శైలజానాథ్ వైసీపీలో చేరారు. ఏపీ విభజన తర్వాత కాంగ్రెస్ పార్టీ తొలిసారి పీసీసీ చీఫ్‌గా రఘువీరా రెడ్డి బాధ్యతలు స్వీకరించగా, ఆయన తర్వాత సాకే ఆ స్థానాన్ని చేపట్టారు. అయితే, అప్పట్లో జగన్‌కు వ్యతిరేకంగా ఎక్కువగా మాట్లాడడం లేదని కొందరు పెద్దలు అధిష్టానానికి ఫిర్యాదు చేయడం, సాకే కు రాజకీయం పై పెద్దగా ఆశక్తి ఉండకపోవడంతో ఆయన పార్టీ పదవి నుంచి తప్పుకున్నారు. ఇప్పుడు మళ్లీ ఆయన రాజకీయాల్లోకి యాక్టీవ్ అవుతున్నారు.

## కుల గణన సర్వే మళ్ళీ....

కొందరు ఉద్దేశపూర్వకంగా ఈ సర్వేలో వివరాలు వెల్లడించ లేదని మల్లు భట్టి విక్రమార్క వివరించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుల గణన సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో రాష్ట్రంలో బీసీల శాతం స్వల్పంగా తగ్గినట్లు నివేదిక స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో 2014లో నాటి టీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సర్వేలో 51 శాతానికి పైగా బీసీలు ఉన్నారని ఆ పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం జరిపిన సర్వేలో బీసీల శాతం దాదాపు 5 శాతానికిపైగా తగ్గడంపై ఆయన సందేహం వ్యక్తం చేశారు.

## 42 శాతం రిజర్వేషన్లు...

ఆర్. కృష్ణయ్య విమర్శించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని ప్రకటించారని, ఇప్పుడు తప్పించుకోవడానికి కుట్ర చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. రిజర్వేషన్లు పెంచకుండా కులాల వారీగా జనాభా లెక్కలు తప్పుగా చూపిస్తూ ప్రజల దృష్టి మరల్చేందుకు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారని సీఎంపై కృష్ణయ్య ఆరోపణలు చేశారు.

## భారీ అగ్నిప్రమాదం..

బాధ్యతగా వ్యవహరించేలా చూడాలని పోలీసు ఉన్నతాధికారులను హోం మంత్రి అనిత ఆదేశించారు. ఇక ఇదే అగ్ని ప్రమాదంపై విజయవాడ నగర మున్సిపల్ కమిషనర్ ఙ్ఞాన్‌చంద్ మాట్లాడుతూ.. ఈ అగ్ని ప్రమాదానికి కారణం గ్యాస్ సిలిండర పేలడమే కారణమన్నారు. ఈ ప్రమాదంలో రెండు షెడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని తెలిపారు. భారీ ఆస్తి నష్టం సంభవించిందని చెప్పారు. అయితే ఈ ఎగ్జిబిషన్‌కి పర్మిషన్ టైమ్ అయిపోయినప్పటికీ ఎందుకు ఉంచారనే అంశంపై విచారణ చేపట్టామని పేర్కొన్నారు. ఈ జనవరి 28వ తేదీతో ఈ ఎగ్జిబిషన్‌కి పర్మిషన్ అయిపోయిందని చెప్పారు. ఈ నేపథ్యంలో ఎగ్జిబిషన్ నిర్వాహకులు మీద ఎఫ్ఐఆర్ ఫైల్ చేసి కఠినమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ ప్రమాదం నేపథ్యంలో ఇక్కడున్న పక్షులు, జంతువులను సురక్షిత ప్రాంతానికి తరలించామని మున్సిపల్ కమిషనర్ ఙ్ఞాన్‌చంద్ చెప్పారు. అయితే ఈ భారీ అగ్ని ప్రమాదంలో ఎక్కడ ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని ఆయన పేర్కొన్నారు.

## వైసీపీ చేసే దుష్ప్రచారాన్ని...

అనడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. ఏపీలో బటన్ నొక్కే సీఎం పోయి అభివృద్ధి కాంక్షించే నాయకుడు ముఖ్యమంత్రిగా ఉన్నారని గుర్తుచేశారు. జగన్ మద్యం తాగి ప్రజల ఆరోగ్యం పోయిందని ఆరోపించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో బర్డ్ ఫ్లూపై ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడుతున్నామని తెలిపారు. బర్డ్ ఫ్లూపై సీఎం చంద్రబాబు నిరంతరం అధికారులతో మాట్లాడుతున్నారని తెలిపారు. వైసీపీ చేసే దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని.. అలా చేస్తే వదలబోమని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

## మంత్రి గొట్టిపాటి చొరవతో పూర్తయిన

# సంతమాగలూరు ఎస్సీ హాస్టల్ పునర్నిర్మాణం

**రూ.45 లక్షల నిధులతో పూర్తి స్థాయిలో హాస్టల్ ఆధునికీకరణ**
**ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల విద్యకు కూటమి ప్రభుత్వం అండదండలు**
**గొట్టిపాటికి కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థులు, గ్రామస్థులు**
**నాడు-నేడు అంటూ వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధుల దుబారా**
**వైసీపీ ప్రభుత్వంలో సాంఘీక, సంక్షేమ హాస్టల్లలో తగ్గిన విద్యార్థుల శాతం**
**మంత్రి గొట్టిపాటి రవికుమార్**



**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఫిబ్రవరి 12)**

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరిన బాపట్ల జిల్లా సంతమాగలూరు ఎస్సీ వసతి గృహం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో పూర్వ వైభవం సంతరించుకుంది. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో రేకులు విరిగి, బాత్ రూమ్స్ తలుపులు లేకుండా, శిథిలావస్థకు చేరిన హాస్టల్ భవనాన్ని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ రూ.45 లక్షల నిధులతో పునర్నిమించారు. నాలుగు నెలల క్రితం సంతమాగలూరు పర్యటనలో భాగంగా హాస్టల్ పరిస్థితిని, విద్యార్థుల దుస్థితిని చూసి చలించిన మంత్రి గొట్టిపాటి విద్యార్థులకు ఎటు వంటి ఆటంకాలూ లేకుండా హాస్టల్ భవనాన్ని పూర్తి స్థాయిలో ఆధునికీకరణ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అంతే కాకుండా వైసీపీ (తరువాయి 4లో...)



# ఆధార్‌కార్డుల ప్రత్యేక శిబిరాల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

**జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 12)**

ఆరేళ్ళలోపు బాలలకు ఆధార్ కార్డుల జారీ కోసం ప్రత్యేక శిబిరాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోనని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా స్పష్టం చేసారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు. సిబ్బందితో బుధవారం ప్రకాశం భవనం లో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆధార కార్డు లేని పిల్లలకు వాటిని తక్షణమే జారీ చేసేందుకు నిర్వహిస్తున్న శిబిరాల తీరు, పురోగతి పై కలెక్టరు సమీక్షించారు. పని తీరు పేలవంగా వున్న సిడిపిఓ, సూపర్వైజర్లకు షోకాజు నోటీసులు జారి చేయాలని పి.డి. హేనా సుజన్‌ను ఆదేశించారు. నెట్వర్క్ సరిగా రావడం లేదని, గిరిజన ప్రాంతమని, మిషన్ పనిచేయడం లేదని సాకులు చెబుతూ ఇతర శాఖలపై నెపం మోపేలా ప్రవర్తిస్తే సహించబోనని స్పష్టం చేసారు. ఇలాంటి పరిస్థితులే ఉన్నచోట్ల కూడా కొందరు సిబ్బంది పని తీరు మెరుగ్గా వుందని అభినందించారు. సాకులు చెబుతూ నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఉపేక్షించబోనని తేల్చి చెప్పారు. ఆధార్ శిబిరాల నిర్వహణ ప్రధాన బాధ్యత ఐసిడిఎస్ అధికారులదేనన్నారు. ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు, పోస్టల్ అధికారుల సహకారం తీసుకుని సమన్వయంతో ఈ సిబిరాలు నిర్వహించాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేసారు. జనన ధృవీకరణ పత్రాలు వున్న వారికి తక్షణమే ఆధార్ కార్డుల కోసం వివరాలు నమోదు చేయాలని చెప్పారు. జనన ధృవీకరణ పత్రాలు లేని వారికి తొలుత వాటిని మంజూరు చేసేలా చూడాలని చెప్పారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని క్షుణ్ణంగా పర్యవేక్షిస్తూ ఆధార్ కార్డుల మంజూరు పై రోజువారీ నివేదికలను తనకు సమర్పించాలని పి డి ని కలెక్టరు ఆదేశించారు. ఈ సమావేశంలో సిడిపిఓలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# చీరాల ఆర్టీసీ డిపోలో పారిశుద్ధ్య లోపాలు

**ప్రయాణికుల అవసరాలు పట్టించుకునే వారెవరు**




**(షణ్ముఖ వెలుగు, బాపట్ల స్టాఫ్ రిపోర్టర్, ఫిబ్రవరి 12)**

బాపట్ల జిల్లాలోనే ఎక్కువ బస్సులు, ఉన్నటువంటి డిపో చీరాల.ఎక్కువ ప్రజా రవాణా జరిగే ప్రదేశం చీరాల ఆర్టీసీ బస్టాండ్. జిల్లాలోనే తలమానికంగా ఉన్నటువంటి చీరాల ఆర్టీసీ డిపోలో అధికారులు మాత్రం ప్రయాణికులపై చిన్న చూపు చుస్తున్నారు ఎందుకో తెలియడం లేదు.కనీసం పేదవానికి మంచినీరు కూడా అందించలేని దుస్థితిలో ఉన్న చీరాల ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికుల త్రాగునీరు నిమిత్తం నిర్మించినటువంటి కుళాయిలు విరిగిపోయి, ఆప్రాంతమంత పాచి పేరుకు పోయి అద్వాన్నంగా ఉన్నాయి. నీటి కుళాయిల దగ్గర ఉన్నటువంటి పారిశుధ్య విధానం అనారోగ్యానికి దారి తీసే విధంగా ఉంది. డిపో పరిసర ప్రాంతాలు కలరా, మలేరియా నే కాకుండా కొత్త వ్యాధులకు దారులు చూపిస్తున్నాయి. ఆర్టీసీ ప్రయాణం ముద్దు, ఆటో ప్రయాణం (తరువాయి 4లో...)

# ప్రకాశంలో వెనుక 'బడి'

**సక్రమంగా సాగని చదువు సంధ్యలు**
**అధికారుల తీరు అంతంత మాత్రమే**
**ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు**



**(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, ఫిబ్రవరి 12)**

ప్రభుత్వ బడులు విద్యలో వెనుకబడిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామంటూ చెప్పినదంతా ఆర్భాటపు ప్రచారమనేది తేటతెల్లమైంది. కొన్ని స్కూళ్లల్లో సదుపాయాలు ఉంటే ఫలితాలు లేవు. అభ్యసన పలితాలు బాగున్న కొన్ని చోట్ల వసతులు అంతంతమాత్రంగా ఉన్నాయి. కొన్ని పాఠశాలల్లో ఈ రెండు లేవు. అటు మౌలిక సదుపాయాలు, ఇటు ఫలితాల్లో అత్యుత్తమంగా నిలిచిన పాఠశాలలు ఒక్కటీ జిల్లాలో లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీని పై విద్యాశాఖాధికారులు దృష్టిసారించారు. ఆర్జేడీ ఆధ్వర్యంలో కార్యాచరణ చేపట్టారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాజాగా చేపట్టిన అధ్యయనంలో ప్రభుత్వ పాఠశాలలల్లో వాస్తవ పరిస్థితి వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల స్థితిగతులను తెలుసుకునేందుకు మౌలిక సదుపాయాలు, అభ్యసన ఫలితాలను (లెర్నింగ్ అవుట్ కమ్స్) క్రోడీకరించి ప్రభుత్వం స్టార్ రేటింగ్‌ను ప్రకటించింది. ఏ పాఠశాల ఏ స్థాయి ఉంది తదితర అంశాల పై వివరాలు సేకరించడంతో మొన్నటి వరకు ఉన్న వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు పథకం పేరుతో చేసిన హడావుడి అంతా ఉత్తదేనని తేలిపోయింది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు ఫైవ్ స్టార్లు, అభ్యసన ఫలితాలకు ఫైవ్ స్టార్లు ప్రామాణికంగా తీసుకొని జిల్లాలో ఈ అధ్యయనం చేశారు.

**నాడు-నేడు అంతా హడావుడే :** జిల్లాలో మొత్తం ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు 2,406 ఉండగా వాటిలో ఏ ఒక్క పాఠశాలకు కూడా కనీస విభాగంలో ఫైవ్ స్టార్ వచ్చిన పరిస్థితి లేకుండాపోయింది. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిగా దీటుగా అభివృద్ధి చేసినట్లు గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటపు ప్రచారం చేసుకుందే తప్ప వాటి అభివృద్ధిని పట్టించుకోలేదు. నాడు-నేడుతో పాఠశాల స్వరూపాన్నే మార్చామని జగన్మోహన్‌రెడ్డి పదే పదే చెప్పుకోవడం తప్పా ఆచరణలో అభివృద్ధి చేయలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేసిన అధ్యయనంలో స్టార్ రేటింగ్ ఫలితాల్లో 5 స్టార్ ఫలితాలు వచ్చిన పాఠశాలలు ఒక్కటి లేదు. 4 స్టార్ ఫలితాల్లో కేవలం 439 పాఠశాలలు ఉండగా అభ్యసనలో 4 స్టార్‌లో నాలుగు పాఠశాలలు ఉన్నాయంటే పాఠశాలల పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**ఆర్భాటంతో బోధన నిర్వీర్యం :** గత వైసీపీ ప్రభుత్వం పాఠశాలలను రాజకీయ ప్రచారానికి వాడుకుందనేది ఇప్పుడు బహిర్గతమైంది. విద్యార్థుల హాజరు, వారి పరీక్షల ఫలితాలను పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. నాడు-నేడు పేరుతో బడులకు రంగులు, కుర్చీలు, బెంచీలు అంటూ బోధనను నిర్వీర్యం చేసిందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి పాఠశాల విద్య అంటే నాడు-నేడు పథకం ఒక్కటేనన్నట్లుగా మార్చేసి ఫలితాలను దిగజార్చిందనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

**స్టార్ రేటింగ్ ఇలా :** మౌలిక సదుపాయాల విభాగంలో రేటింగ్ కోసం 18 అంశాలను ప్రామాణికంగా తీసుకున్నారు. పాఠశాలలో మరుగుదొడ్లు, ల్యాబ్‌లు, క్రీడామైదానం, ప్రహరీ, గ్రంథాలయం, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, తరగతి గదులు, తాగునీరు తదితర అంశాలను పరిశీలించారు. ఒక్కొక్క అంశానికి ఐదు చొప్పున గ్రేడింగ్ ఇచ్చారు.

వీటిలో 90 శాతం గ్రేడింగ్ సాధించిన పాఠశాలలకు ఫైవ్ స్టార్లు కేటాయించగా 30 కంటే తక్కువ ఉంటే ఒక స్టార్‌ను ఇచ్చారు. అభ్యసన ఫలితాల విభాగంలో ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, గత ఏడాది పదవ తరగతి పరీక్ష ఫలితాలు, ఇటీవల జరిగిన సమ్మేటివ్ అసెసమెంట్ పరీక్షల ఫలితాలను, ఒకవేళ పదవ తరగతి లేకపోతే ఫార్మేటివ్ అసెసమెంట్ పరీక్షల ఫలితాలను ప్రామాణికంగా తీసుకొని ఈ అధ్యయనం చేశారు. ఈ నాలుగు విభాగాల్లో హాజరుకు 40శాతం, ఫలితాలకు 60శాతం గ్రేడింగ్ ఇచ్చారు. రెండు కలిపి 90శాతం దాటిన బడులకు ఫైవ్ స్టార్ రేటింగ్ ఇచ్చారు. అంతకంటే తక్కువ ఫలితాలు ఉన్న పాఠశాలలకు ఒకటి నుంచి నాలుగు స్టార్లు కేటాయించారు.

**జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలకు రేటింగ్ ఇలా**

| స్టార్ రేటింగ్ సదుపాయాలు | అభ్యసన ఫలితాలు |
|---|---|
| జీరో స్టార్ 2 | 07 |
| 1 స్టార్ 60 | 699 |
| 2 స్టార్ 871 | 1,446 |
| 3 స్టార్ 103 | 4250 |
| 4 స్టార్ 439 | 04 |
| 5 స్టార్ 00 | 00 |

# భూముల రీసర్వేలో నిర్లక్ష్యం తగదు

**జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 12)**

భూముల రీసర్వేలో నిర్లక్ష్యం ఉండకూడదని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. బుధవారం ఆమె కొత్తపట్నం మండలం లోని గాదెపాలెం గ్రామంలో పర్యటించారు. ఈ గ్రామంలో జరుగుతున్న రీసర్వేను పరిశీలించారు. ఈ గ్రామంలో 124 మంది రైతులకు చెందిన సుమారు 650 ఎకరాలను సర్వే చేశామని, విలేజ్ బౌండరీ కూడా సర్వే చేశామని, ప్రభుత్వ భూముల సర్వే 50% పూర్తయిందని అధికారులు తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ, ఎంతమంది రైతులకు సంబంధించిన భూములను ఈరోజు సర్వే చేశారు?.. ఎన్ని టీములు ఫీల్డ్ విజిట్లో ఉన్నాయి? అని అధికారులను అడిగారు. నాలుగు టీములు ఫీల్డ్ లో పనిచేస్తున్నాయని, ఒక్కో టీముకు (తరువాయి 4లో...)





# మంత్రి గొట్టిపాటి చొరవతో పూర్తయిన సంతమాగలూరు ఎస్సీ హాస్టల్ పునర్నిర్మాణం



హయాంలో సాంఘిక, సంక్షేమ వసతి గృహాలు నిర్లక్ష్యానికి గురువుతున్న విషయాన్ని సంబంధిత మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి దృష్టికి కూడా తీసుకెళ్లారు. మంత్రి డోలా కూడా వెంటనే స్పందించి సంబంధిత శాఖ నుంచి నిధులను విడుదల చేశారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని వసతి గృహానికి మరమ్మత్తులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించారు. పూర్తి స్థాయిలో ఎస్సీ హాస్టల్ అందుబాటులోకి రావడంతో విద్యార్థులతో పాటు చుట్టు పక్కల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల కోసం మంత్రి గొట్టిపాటి చూపుతున్న చొరవకు వారంతా తమ కృతజ్ఞతలు తెలియజేశారు.


**వైసీపీ ప్రభుత్వ హయాంలో తగ్గిన విద్యార్థులు....** పునర్నిర్మాణం పూర్తి చేసుకున్న సంతమాగలూరు ఎస్సీ హాస్టల్ భవనాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం సందర్శించారు. ఆధునికీకరించిన భవన సముదాయాలను, ఇతర ప్రాంతాలను మంత్రి స్వయంగా తిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో సాంఘిక, సంక్షేమ హాస్టల్ భవనాలన్నీ నిర్వహణాలోపం, నిర్లక్ష్యంతో శిధిలావస్థకు చేరాయని తెలిపారు. సంతమాగలూరు ఎస్సీ హాస్టల్ లో 2019 తెలుగుదేశం ప్రభుత్వ సమయంలో మొత్తం 170 విద్యార్థులు ఉండేవారని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వ విధానాలతో ఆ హాస్టల్ విద్యార్థుల సంఖ్య 30 పరిమితమయ్యిందని వాపోయారు. నాడు-నేడు, రేషనలైజేషన్ పేరుతో బడుగు,బలహీన వర్గాలను విద్యకు జగన్మోహన్ రెడ్డి దూరం చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పేదల చదువుకు అండగా ఉంటుందని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు.

## చీరాల ఆర్టీసీ డిపోలో పారిశుద్ధ్య లోపాలు






వద్దు అనే విధానంలో ఉన్నటువంటి ఆర్టీసీ ఉద్యోగులు జనరల్ వాటర్ వద్దు, మినరల్ వాటర్ ముద్దు అనే విధానంలో ప్రయాణికులకు ప్రచారం చేసే విధంగా ఉందని ప్రయాణికులు చెప్పుకుంటున్నారు.ప్రయాణికుల అవసరాలు,వారి ప్రాణాల కంటే కూడా డిపోలో ఉన్నటువంటి దుకాణదారులకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్టు వ్యవహరిస్తున్న చీరాల డిపో ఆర్టీసీలో సంబంధిత ఉద్యోగులు అదికూడా నిజమే మరి లక్షలకు లక్షలు పెట్టి మరి ఆ దుకాణాలు టెండర్లను కొనుకుంటారు మరి వారికి న్యాయం చేయాలికదా అంటూ ప్రయాణికులు విమర్శించుకుంటున్నారు. నరసరావుపేట మార్గంలో వెళ్లే బస్సులకు బస్టాండ్ ఆవరణలో స్థాన చలనం లేక ఆ రూటు బస్సులను బస్సులను బయటకు వెళ్ళే మార్గంలో 10,20 నిమిషాల వ్యవధిలో అవుతారు. బస్సు ఎక్కి కూర్చున్న ప్రయాణికులు బస్సు కదిలేంత వరకు అక్కడ వచ్చే మూత్ర విసర్జన దుర్వాసనకు ఊపిరి పీల్చుకుంటు, బిగపట్టుకుంటు ఉండాల్సిందేనని మకిది అలవాటైపోయింది అంటూ ప్రతిరోజు తిరిగే ప్రయాణికులు వాపోతేన్నారు.ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని పర్యావరణ పరిరక్షణ తోపాటు ప్రయాణికుల ప్రాణాలు కూడా కాపాడేలా చూస్తారని ప్రయాణికులు కోరుతున్నారు.



## భూముల రీసర్వేలో నిర్లక్ష్యం తగదు

20 ఎకరాల చొప్పున కేటాయించామని అధికారులు తెలిపారు. దీనితో ఆర్డీవో శ్రీమతి లక్ష్మీ ప్రసన్న ద్వారా ఇద్దరు రైతులకు ఫోన్ చేయించారు. ఎన్ని రోజుల ముందుగా సర్వేకు సంబంధించిన నోటీసులు ఇచ్చారు?... మీ సమక్షంలోనే భూములను సర్వే చేశారా?... అని ఆర్డీవో ద్వారా ఆరా తీశారు. భూముల మ్యుటేషన్ విషయంలో నిబంధనలు ఉల్లంఘించరాదని అధికారులకు ఆమె స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట సర్వే శాఖ సహాయ సంచాలకులు గౌస్ బాషా, తహసీల్దారు మధుసూదనరావు, మండల సర్వేయర్, ఇతర సిబ్బంది ఉన్నారు.





## ఆధార్‌కార్డుల ప్రత్యేక శిబిరాల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు





# కంది పంట పరిశీలన

**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, ఫిబ్రవరి 12)**

పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా కంది పంటను ఏ ఓ దేవిరెడ్డి శ్రీనివాసులు బుధువారం పరిశీలించారు. మండలంలోని గజ్జలకొండ, బోడపాడు గ్రామాల యందు మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు అధ్యక్షతన పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కంది పంటను పరిశీలించారు. తదుపరి గజ్జలకొండ, బోడపాడు గ్రామాల యందు గ్రామసభలు నిర్వహించి కంది పంటలో కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. కందులలో తేమ 12 శాతం లోపు ఉండాలని, ఇతర గింజలు ఒక శాతం లోపు ఉండేలా చూసుకోవలని, గింజలు రంగు మారకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.




అలానే ప్రస్తుతం రైతుసేవాకేంద్రం లోని సిబ్బందిని సంప్రదించి, ఫార్మర్ రిజిస్ట్రీ యందు ప్రతీ రైతు నమోదు చేపించుకోవలని తెలిపారు. దానికి రైతులకు 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. దీని ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్జలకొండ, బోడపాడు రైతుసేవాకేంద్రాల సిబ్బంది నవీన్, పావనేశ్వరి మరియు రైతులు పాల్గొన్నారు.




# పెండింగ్ సమస్యలను ఎన్డీఏ ప్రభుత్వం వెనువెంటనే పరిష్కరించాలి

### ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ డిమాండ్

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఫిబ్రవరి 12)**

రాష్ట్రంలో విభజన ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల్లో రిటైర్డ్ పెన్షనర్స్‌కు పలు హామీలు ఇచ్చిందని హామీలను వెనువెంటనే నెరవేర్చాలని ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం నెల్లూరు జర్నలిస్టు భవన్ నందు ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ అసోసియేషన్ నాయకులు పత్రిక విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేట్ జనరల్ సెక్రెటరీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో మూడు లక్షల 50 వేల మంది విశ్రాంతఉద్యోగులు ఉన్నామన్నారు. 11వ పిఆర్సి బకాయిలను 2020 నుండి ప్రింటింగ్ లో ఉన్నాయని వెనువెంటనే వాయిదా పద్ధతు లో చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉండగా 70, 75 అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ 10%, 15% ఉన్నదన్నారు వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 11వ పిఆర్సిలో అడిషనల్ క్వాంటం మా పెన్షన్ సెవెన్ పర్సెంట్, 12% తగ్గించడం జరిగిందన్నారు. దానిని పాత పద్ధతిలో 10, 15% కు పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్డీఏ కూటమి ఏర్పాటైనప్పటినుంచి 2023 జూలై నుండి ఒక్క డిఆర్ వాయిదా బకాయి ఉన్నది అన్నారు. 2024 జనవరి జూలై నుండి డిఆర్‌లు రెండు పెండింగ్లో ఉన్నాయన్నారు. వెంటనే మూడు వాయిదాలు డియర్ ను పెంచవలసిందిగా ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విభజన ఆంధ్రప్రదేశ్‌లో కందుకూరు సబ్ రిజిస్టర్లు పెన్షన్ పొందుతున్న విశ్రాంతి ఉద్యోగుల సెప్టెంబర్ 2024 నుండి 25 మంది మరణించడం జరిగిందన్నారు. వారి కుటుంబ సభ్యులకు రావలసిన మట్టి ఖర్చులు 25 వేల రూపాయలు ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించలేదని ఆయన ఆరోపించారు. ఇది చాలా దురదృష్టకరమని ఆయన అన్నారు. విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ మట్టి ఖర్చులను వెంటనే వారి వారసులకు వచ్చేలా చర్యలు చేపట్టాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో ఆరు డిఆర్ బకాయిలు వాయిదా పద్ధతులు విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. 2021 పదవీ విరమణ చేసిన ఉద్యోగుల డి వెంకట్ బిల్స్ ట్రెజరీలో చాలా కాలంగా పెండింగ్లో ఉన్నాయని వెనువెంటనే ఆ బిల్స్ చేయనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ వారికి ఉత్తర్వులు జారీ చేయాల్సిందిగా ఆయన కోరారు. కొద్దిపాటి పెన్షన్ తోటి జీవితాలను వెల్లబుస్తున్నామని విశ్రాంతి ఉద్యోగులైన అన్న ఆహారాలు తీసుకొని బ్రతకడం లేదన్నారు. పెన్షన్ ఆరోగ్యం కోసం మందులు తీసుకొని మా జీవితాలను కొనసాగిస్తున్నామన్నారు ఈ విలేకరుల సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ జి వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి సి నలినిరావు, జిల్లా కోశాధికారి జి మురళీ మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 12)**

మండలంలోని ఈగలపాడు, పాతపాడు గ్రామాల్లో సేవా కాంద్రాల పరిధిలో ఉద్యానవనశాఖ అధికారిణి సంధ్య రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాయ కోత అనంతర యాజమాన్యం, కాయ కోత, ఎండబెట్టుట, కాయకోతకు 20 రోజుల ముందు పురుగు మందులను వాడరాదన్నారు. మబ్బులతో కూడిన వాతావరణంలో కోతను చేపట్టకూడదన్నారు. అపరిశుభ్రమైన సంచులు, ఎరువుల సంచులను కోతకు, కోసిన కాయలు తీసుకువెళ్ళడానికి ఉపయోగించకూడదని తెలిపారు. పక్వానికి వచ్చిన కాయలను గమనించుకొని సకాలంలో కోతలను చేపట్టాలన్నారు. కోసిన కాయలను టార్పాలిన్ మీద పలుచగా వేసి తరచూ తిప్పుతూ ఎండబెట్టాలన్నారు.

**కాయ ఎండబెట్టడం:**

కోసిన కాయలను కల్లాలలో ఎండబెట్టాలి మరియు కాయ ఎండటానికి వాతావరణాన్ని బట్టి 2 నుండి 3 వారములు టార్పాలిన్ షీట్ లేదా అనువైన చోట సిమెంట్ కల్లాల మీద ఎండబెట్టినచో మిరపకాయలు వేగంగా ఎండడమే గాక నాణ్యత కలిగి ఉంటుంది. ఎండిన కాయలను టార్పాలిన్ తో కప్పాలి. ఎండిన మిరపకాయలను సంచులలో నింపే సమయంలో మిరపకాయలపై నీరు చల్లకూడదు. తెగులు సోకిన, తాలు, దెబ్బతిన్న, తక్కువ రంగు కలిగిన కాయలను ఏరి వేయాలని తెలిపారు. మిరపకాయలను 11% తేమ వచ్చేవరకు ఎండబెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు మండల వ్యవసాయ అధికారి, గ్రామ వ్యవసాయ సహాయకులు, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## వైభవంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు





**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 12)**

మండల కేంద్రమైన ఉలవపాడులో శ్రీ రాముల వారి గుడి యందు బుధవారం మాఘ మాసం సందర్భంగా పౌర్ణమి రోజు మండల ఆర్యవైశ్య సంఘం తరపున అధ్యక్షులు బాపనపల్లి సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బాపనపల్లి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు బలస సురేష్ కుమార్, కార్యదర్శి పొన్నూరు రామాంజనేయులు, ఉప కార్యదర్శి దివ్యనంద గుప్త, కోశాధికారి మేడా అర్జున్, ఉప కోశాధికారి వాగిచర్ల రాఘవేంద్ర కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఏబీ పార్టీ ప్యాలెస్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 12)**

ఒంగోలులోని గుంటూరు రోడ్డు వద్దగల గుప్తాస్ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఏబీ పార్టీ ప్యాలెస్ ను బుధవారం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ప్రారంభించారు. అందులో ఏర్పాటు చేసిన ప్రైవేట్ థియేటర్ స్క్రీన్ హాలు లో కొద్దిసేపు కూర్చిని పలు వీడియో క్లిప్పింగ్ లు చూశారు. న్నారు. ప్రీమియం ప్రైవేట్ డైనింగ్, పార్టీ స్పేసస్ కోసం ప్రత్యేకంగా చేసిన ఏర్పాట్లను చూసిన ఎంఎల్ఏ నిర్వాహకులను అభినందించారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత కూడా ఏబీ పార్టీ ప్యాలెస్ ను సందర్శించారు. అందులోని ప్రైవేట్ థియేటర్ స్క్రీన్‌ను చూశారు. డైనింగ్ హాలు, పార్టీ స్పెసెస్ చూసి నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు నాళం నరసమ్మ, ఏబీ కంపెనీ సిఈఓ అఖిల్, తదితరులు పాల్గొన్నారు.






# అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత






(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఫిబ్రవరి 12)

ఉప్పలదిన్నె కామేపల్లి మధ్యలో ఉన్న పాలేరు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను బుధవారం ఎస్ఐ అనుక్ అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కామేపల్లికి సంబంధించిన ట్రాక్టర్ యజమానులు జెసిబి ని కూడా తీసుకొని వచ్చి జెసిబి తో ఇసుక నింపుతున్న సమయంలో స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం అందగా ఎస్ఐ కే అనుక్ హుటాహుటిన వెళ్లి నింపుతున్న ట్రాక్టర్లను, జెసిబిని అదుపులోనికి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం తాసిల్దార్ పుల్లారావు కు ఈ విషయం దృష్టికి తీసుకొని వెళ్ళగా ఆయన ఒక్కొక్క ట్రాక్టరుకు రూ.10 వేల రూపాయలు జరిమానా విధించారు.

# మరమ్మత్తుల నిధులకు సంబంధించిన అంచనాలు సిద్దం చేయండి

## - శనివారం లోపు అందజేయండి - జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్

(షణ్ముఖ వెలుగు, తిరుపతి, ఫిబ్రవరి 12)



వసతి గృహాల మరమ్మత్తులకు సంబంధించిన అంచనాల ప్రతిపాదనలు శనివారం లోపు పూర్తి స్థాయిలో పంపాలని, శాఖాపరమైన నిధులకు అదనంగా అవసరమైన నిధులను సిఎస్ఆర్, డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్, ఎంపీ లాడ్స్ తదితర వాటిని వినియోగిస్తున్నామని, అవసరమైన మరమ్మత్తుల మేరకు అంచనాలు తయారు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ ఆదేశించారు. గురువారం ఉదయం స్థానిక కలెక్టరేట్ నుండి సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో, అలాగే మహాత్మా జ్యోతీ రావు పూలే, డా.బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల సమన్వయ కర్తలతో, ఇంజినీరింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ సమీక్షా సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో కనీస అవసర మరమ్మత్తులను త్వరితగతిన సంబంధిత శాఖ అధిపతులు గుర్తించి వాటికి అవసరమైన నిధులకు సంబంధించిన అంచనాలను సిద్ధం చేసి రానున్న శనివారం నాటికి పరిపాలన అనుమతులకు సమర్పించాలని ఆదేశించారు. శాఖాపరమైన నిధులకు అదనంగా అవసరమైన నిధులను పలు మార్గాల ద్వారా సిఎస్ఆర్, ఎంపీ లాడ్స్, డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ ( డిఎంఎఫ్) సమీకరించి మరమ్మత్తులు చేపడుతున్నామని, అవసరమైన మరమ్మత్తులు మరుగుదొడ్ల రిపేరీ, రన్నింగ్ వాటర్ ఉండేలా ఏర్పాటు, ప్రతి కొళాయికి ట్యాప్ ఉండేలా, ట్యూబ్ లైట్లు ఏర్పాటు, ఎలక్ట్రికల్ వైరింగ్, ఎల్ఈడి బల్బుల ఏర్పాటు, కిటికీలకు దోమల మెష్, అన్ని గదులకు తలుపులు, గదులలో లీకేజ్ లేకుండా మరమ్మత్తులు, ఫ్లోరింగ్ మరమ్మత్తులు, ఆర్వో త్రాగు నీటి ప్లాంట్ వంటి ఏర్పాటుకు అంచనాల ప్రతిపాదనలు పూర్తి స్థాయిలో ఉండాలని సూచించారు. సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ మరమ్మతుల కొరకు %ఈ్రాజుఔ×ణజ% ఇంజినీరింగ్ అధికారులు నిధులను సకాలంలో సద్వినియోగం చేసి పనులు నాణ్యతగా చేపట్టాలని, ఏదైనా పొరపాట్లు చేస్తే తీవ్రమైన చర్యలు ఉంటాయని అధికారులను హెచ్చరించారు. మరుసటి సమీక్ష సోమవారం నాడు ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఈ టెలికాన్ఫరెన్స్ నందు జిల్లా సాంఘిక సంక్షేమ మరియు సాధికార అధికారి విక్రమ్ కుమార్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏపీ ఈడబ్ల్యుఐడీసీ బాల సుబ్రమణ్యం రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి చంద్రశేఖర్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సూర్యనారాయణ, మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల జిల్లా సమన్వయకర్త రేష్మ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త గీత, సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 12)

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 15వ తేదీన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ముందుగా ఆర్డీఓ ఆఫీస్‌లో కలెక్టర్ ఓ ఆనంద్, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం టిఆర్ఆర్ కాలేజీలోని హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాటులో భాగంగా పట్టణంలోని టిట్కో ఇళ్ల సముదాయ ప్రాంతాన్ని మరియు వాసవి నగర్ ప్రాంతాలను పరిశీలించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏఎంసీ ఆవరణలో కలెక్టర్ ఓ ఆనంద్, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఎస్పీ కృష్ణ కాంత్, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి సంపత్ కుమార్ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండి అనిల్ కుమార్, సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సూర్య తేజ, మున్సిపల్ రీజనల్ డైరెక్టర్, అధికారులు సభా వేదిక, పార్కింగ్ స్థలం, పోలీస్ భద్రత పలు అంశాల పై అధికారులకు సూచనలు చేశారు. దూబగుంట వద్ద గల వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె అనూష, డిఎస్పీ బాలసుబ్రమణ్యం, పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నె రోశయ్య, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.





# జేఈఈ మెయిన్స్‌లో సరస్వతి విద్యార్థుల అత్యుత్తమ ఫలితాలు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 12)

జాతీయ స్థాయిలో వెలువడిన జేఈఈ మెయిన్స్ 2025 పరీక్షా ఫలితాలలో ఒంగోలు సరస్వతి విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి జిల్లా మొదటి స్థానంలో నిలిచారు. కళాశాలకు చెందిన కె.లోక్ క్రిటి అనే విద్యార్థి 98.82%తో జిల్లాలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంగమూరు రోడ్డులోని సరస్వతి కళాశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఉత్తమ ఫలితాలు పొందిన విద్యార్థినీ విద్యార్థులను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. అనంతరం సరస్వతీ విద్యాసంస్థల చైర్మన్ ఏవి రమణారెడ్డి మాట్లాడుతూ 2025 జేఈఈ మెయిన్స్ సెషన్ వన్ ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులు విజయ డంకా మోగించడం సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. తమ కళాశాల నుంచి 161 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల నందు పాల్గొనగా వారిలో 20 మందికి పైగా 90% పర్సంటేజ్ సాధించినట్లు ఆయన తెలిపారు. కె లోక్ క్రిటీ జిల్లా మొదటి స్థానంలో నిలవగా గుణశేఖర్ రెడ్డి రెండవ స్థానంలో ఇంద్ర మూడో స్థానంలో నిలిచారని వెల్లడించారు. వాటితో పాటుగా జిల్లాలో మొదటి పది స్థానాలలో సరస్వతి విద్యార్థులు నిలిచారని తెలియజేశారు. ఇంతటి ఉన్నత ఫలితాలు పొందటానికి కారణం శ్రీ సరస్వతి అకాడమిక్ ప్రోగ్రాం యొక్క పటిష్టత అని పేర్కొన్నారు. సాధారణ విద్యార్థులతో అసాధారణ విద్యార్థులు సాధిస్తున్న ఏకైక సంస్థ సరస్వతి విద్యాసంస్థలు అని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ సమావేశంలో కళాశాల డైరెక్టర్లు గణేష్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, సీఈవో ఎన్ సురేష్‌తో పాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీలక్ష్మి గణపతి శిలా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు

(షణ్ముఖ వెలుగు, సిఎస్ పురం, ఫిబ్రవరి 12)

సిఎస్‌పురం మండలంలోని అయ్యలూరివారిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మి గణపతి శిలా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భగా కదిరి బాబురావుకి ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు శాలువాతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముత్యాల నారాయణరెడ్డి, వైస్ ఎంపిపి భూమిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ మునగల నారాయణరెడ్డి, ముత్యాల రమణారెడ్డి, జి రమణారెడ్డి, జి తిరుమలకొండారెడ్డి, పెద్దిరెడ్డి రామిరెడ్డి, పాలగుళ్ళ మోహన్‌రెడ్డి, నారాయణరెడ్డి, యస్ శివారెడ్డి, పట్నం తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా పోలీసులను అభినందించిన ఎస్పీ ఏ ఆర్ దామోదర్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 12)

రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటిన జిల్లా పోలీసులను జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ అభినందనలు తెలిపారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో అనంతపురంలో రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రకాశం జిల్లా పోలీస్‌శాఖకు తరపున 30 ప్లస్ ఏజ్ గ్రూప్ విభాగంలో పోలీసులు వివిధ విభాగాలలో తమ ప్రతిభను చాటుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని విశేష ప్రతిభ కనబరిచి పలు పతకాలు కైవసం చేసుకున్న ఆర్ఎస్ఐ సురేష్, కానిస్టేబుల్‌ను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి సర్టిఫికెట్స్, మెడల్స్‌ను ఆయన చేతుల మీదగా అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలలో పతకాలు సాధించిన ఏఆర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఆర్ఎస్ఐ సురేష్ 100మీ, 200మీ, లాంగ్ జంప్ 4/100, 4/400లో వరుసగా 4 గోల్డ్, 1 సిల్వర్ మెడల్స్ సాధించారు. కానిస్టేబుల్ కె శ్రీనివాసరావు 400మీ, 800మీ, 4/100, హై జంప్, 4/400 వరుసగా 4 గోల్డ్, 1 సిల్వర్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఒకవైపు జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూనే మరోవైపు క్రీడల పట్ల ఆసక్తితో నిరంతరం ప్రాక్టీస్ చేస్తూ పతకాలు సాధించి ప్రకాశం జిల్లా పోలీస్ శాఖ ఖ్యాతిని ఇనుమడింపజేయడం గర్వకారణమని, అలాగే త్వరలో బెంగుళూరు లో జరగనున్న జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలో కూడా సత్తా చాటి జిల్లా పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్టలు పెంచాలని కోరారు. జిల్లా పోలీస్ శాఖలో ప్రతిభ గల పోలీస్ సిబ్బంది క్రీడలలో పాల్గొనాలన్నారు. సిబ్బందిలో ఉన్న క్రీడా కౌశల్యాన్ని గుర్తించి, తద్వారా వారిలో పోటీతత్వాన్ని సహకారాన్ని పెంపొందిస్తామని, క్రీడలలో వారికి ప్రోత్సాహం అందిస్తూ అన్ని విధాలా సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పీ కె శ్రీనివాసరావు, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.






షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com


# మారుమూల గ్రామంలో జన్మించి రాష్ట్రస్థాయికి ఎదిగిన అరుదైన వ్యక్తి ఇరిగినేని

## అవినీతి అక్రమ సంపాదన తెలియని నిజమైన ప్రజానాయకు ఇరిగినేని

### కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి





(షణ్ముఖ వెలుగు, పామూరు, ఫిబ్రవరి 12)

కనిగిరి నియోజకవర్గ రాజకీయాల్లో విలక్షణమైన నేతగా, అవినీతి అక్రమ సంపాదన తెలియని నేతగా, జీవితకాలం పేదల కోసం పోరాటం చేసిన నేతగా ఇరిగినేని తిరుపతి నాయుడు పేరు చరిత్రపుటల్లో నిలిచిపోతుందని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ప్రముఖ పారిశ్రామికవేత్త కోటపాటి జనార్దన్ రావు, కనిగిరి ఏఎంసీ చైర్మన్ యారవ శ్రీనివాసులు అన్నారు. ఇరిగినేని ఎనిమిదవ వర్ధంతి సందర్భంగా బొట్లగూడూరు మోపాడు గ్రామాల్లోని ఇరిగినేని విగ్రహానికి, ఘాట్‌కు పూలమాలలు వేసి వారు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ కుటుంబంలో జన్మించి కనిగిరి నుంచి మూడు పర్యాయాలు శాసనసభ్యులుగా ఎన్నికై కనిగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపి, ఒక్క అవినీతి మరక లేకుండా నిజమైన ప్రజా నాయకుడిగా ఈ ప్రాంతానికి ఆయన సేవ చేశారని వారన్నారు. ఇరిగినేని అనుచరులుగా శిష్యులుగా పామూరు మండలం నుంచి అనేకమంది అనేక పదవులను అలంకరించి ఎంతో ఉన్నత స్థానానికి చేరుకున్నారని అన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో యువత ఇలాంటి మహోన్నత వ్యక్తులను, వారి జీవన విధానాన్ని, వారి పరిపాలన విధానాన్ని ఆదర్శంగా తీసుకోవాలని వారు సూచించారు. ఎంత ఎదిగిన నిరాడంబరంగా ఉంటూ మామ, తమ్ముడు, బావ, అన్న అంటూ ఆప్యాయంగా కార్యకర్తలను పిలిచే ఏకైక నాయకుడు ఇరిగినేని వారన్నారు. ఈ కార్యక్రమంలో బొల్లా నరసింహారావు, యారవ సంజీవ ప్రసాద్ రెడ్డి, పాలపర్తి రమణయ్య, అడుసు మల్లి ప్రభాకర్ చౌదరి, గుర్రం వెంకటేశ్వర్లు, కోటపాటి నరసింహారావు, కోటపాటి రాజా, ఉప్పలపాటి హరిబాబు, డివి మనోహర్, తడికమల సుబ్బారావు, మెంటా నరసింహారావు, పిడుగు శ్రీనివాసులు, వాయినేని రాఘవ, రహీముల్లా, పలువురు టిడిపి నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు



# 14న నెల్లూరులో కిసాన్ మేళ

## వ్యవసాయంలో ఆధునిక సాంకేతికత పై రైతులకు అవగాహన

## 60 స్టాళ్లతో వ్యవసాయ ప్రదర్శన ఏర్పాటు

## తిరుపతి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ సుమతి





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఫిబ్రవరి 12)

ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం, రాష్ట్ర వ్యవసాయ శాఖ సంయుక్తంగా ఈనెల 14న నెల్లూరులోని ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం వ్యవసాయ పరిశోధనా స్థానంలో కిసాన్ మేళాను నిర్వహించనున్నట్లు తిరుపతి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ సుమతి తెలిపారు. బుధవారం నగరంలోని వ్యవసాయ పరిశోధన స్థానంలో ఆమె పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునిక సాంకేతికత లాభసాటి వ్యవసాయం అనే ప్రధాన అంశంతో రైతులకు వ్యవసాయ విజ్ఞానాన్ని అందించడమే లక్ష్యంగా నెల్లూరు నగరంలోని ఆకుతోట సమీపంలో గల వ్యవసాయ పరిశోధన స్థానంలో కిసాన్ మేళాను ఏర్పాటు చేసినట్లు ఆమె చెప్పారు. ఈ కిసాన్ మేళాలో ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానంపై రైతులకు అవగాహన కల్పించేందుకు 60 స్టాళ్లతో వ్యవసాయ ప్రదర్శన ఉంటుందని ఆమె చెప్పారు. అలాగే వివిధ వ్యవసాయ పంటలైన వరి, అపరాలు, వేరుశనగ, నూనె గింజలు, పత్తి, చిరుధాన్యాలకు సంబంధించిన ప్రధాన శాస్త్రవేత్తలు ఆ పంటలలో చేపట్టవలసిన వివిధ ఆధునిక వ్యవసాయ యాజమాన్య పద్ధతులను రైతులకు వివరిస్తారన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, ఆక్వా, మత్స్య రంగాలకు సంబంధించిన శాస్త్రవేత్తలు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు ఈ కిసాన్ మేళాలో పాల్గొంటారని ఆమె చెప్పారు. అన్నదాతలందరూ ఈ కిసాన్ మేళాలో పాల్గొని వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక విజ్ఞానం అందిపుచ్చుకుని ఈ కిసాన్ మేళాను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

# ఇద్దరు మృతికి కారణమైన వ్యక్తికి రెండు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా

## కేసును ఛేదించిన పోలీసులకు ఎస్పీ అభినందనలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 12)

లారీని అజాగ్రత్తగా నడిపి ఇద్దరు మఅతికి కారణమైన వ్యక్తికి రెండు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానాను ఒంగోలు స్పెషల్ జెఎఫ్‌సిఎం ఎక్సైజ్ కోర్టు జడ్జి ఎస్ కోమలి వల్లి తీర్పు వెల్లడించారు. బుధవారం అందిన వివరాల ప్రకారం 2019 ఫిబ్రవరి 7వ తేదిన నాగులుప్పలపాడు సమీపంలోని పోతవరంకుంట దగ్గన జరిగిన రోడ్డు ప్రమాదంలో పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని మదర్ థెరిసా కాలనీకి చెందిన లారీ డ్రైవర్ పత్తిపాటి ఆదినారాయణ అతివేగంగా లారీని నిర్లక్ష్యంగా నడిపాడు. ఆటోను ఢీ కొట్టాడు. ఆటో బోల్తా పడింది. దీంతో నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు గ్రామనికి చెందిన పాలపర్తి సుభాషిణి, ఇండ్ల రమణమ్మ, అనే ఇద్దరు మరణించగా ఆటోలో మిగిలిన వారికి గాయాలయ్యాయి. అప్పటి నాగులుప్పలపాడు ఎస్సై జెబిఎన్ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కోర్టులో అభియోగ పత్రాలను దాఖలు చేశారు. అనంతరం అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె శ్రావణ్ కుమార్ ప్రాసిక్యూషన్ తరుపున వాదించారు. పోలీస్ సిబ్బంది సాక్షులను కోర్ట్‌లో సమయానుసారం హాజరు పరుస్తూ ప్రకాశం జిల్లా ఎస్పీ మార్గదర్శకత్వంలో గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా సమర్థవంతంగా విచారణ జరిపి సరైన సాక్ష్యాధారాలతో నిందితుడిపై నేరనిరూపణ చేశారు. సదరు ఈ కేసులో సరైన సాక్ష్యాధారాలు కోర్ట్‌లో ప్రవేశపెట్టి సమర్థవంతంగా ట్రయల్ మానిటరింగ్ చేసి నిందితుడికి శిక్షించబడటంలో క్రియాశీలక పాత్ర పోషించిన అప్పటి ఎస్ఐ జెబిఎన్ ప్రసాద్, కోర్ట్ కానిస్టేబుల్ పోతురాజులను జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ అభినందించారు.

# ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించిన ఎమ్మెల్యే

(షణ్ముఖ వెలుగు, కంభం, ఫిబ్రవరి 12)

కంభం పట్టణంలోని ఎంపిడివో కార్యాలయంలో బుధవారం గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజాసమస్యలు అర్జీల ద్వారా తెలియజేయాలని కోరగా పలువురు పట్టణ గ్రామాల ప్రజలు వారి సమస్యలు అర్జీల ద్వారా తెలుపగా ఆ అర్జీలను ఎమ్మెల్యే పరిశీలించి వారి సమస్యలు తెలుసుకొని వెంటనే మీ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రెండువేల రూపాయల పింఛన్ నాలుగు వేలు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు. ఎల్లప్పుడూ ప్రజల గురించి ఆలోచిస్తూ మీ సమస్యలు స్వయంగా తెలుసుకొని వెంటనే పరిష్కరించే విధంగా ఈ ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. మీకు ఎప్పుడు ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే మాకు తెలియజేయాలని ఈ సందర్భంగా తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్వో కిరణ్, ఎంపిడివోలు, ఎంపిటీసిలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





# నూతన చర్చి నిర్మాణానికి రూ.1 లక్ష రూపాయల విరాళం

## ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ద్వారా నిర్వాహకులకు అందజేసిన రెబ్బవరపు మాల్యాద్రి



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఫిబ్రవరి 12)

కందుకూరు మండలం మోపాడు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రార్థనా మందిరానికి తెలుగుదేశం పార్టీ నాయకుడు రెబ్బవరపు మాల్యాద్రి కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేతుల మీదుగా చర్చి నిర్వాహకులకు రూ.1 లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా చర్చి నిర్మాణానికి లక్ష రూపాయలు అందజేసిన రెబ్బవరపు మాల్యాద్రిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు రావుల రవి, ఇతర నేతలు పాల్గొన్నారు.


# ఇంకుడు గుంతల నిర్మాణాన్ని లక్ష్యం మేరకు చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 12)

ఇంకుడు గుంతల నిర్మాణాన్ని లక్ష్యం మేరకు చేపట్టడంపై తక్షణమే దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. బుధవారం ప్రకాశం భవనం నుంచి ఎంపీడీవోలు , మున్సిపల్ కమిషనర్లు, ఏ.పి.ఓ.లు, పంచాయతీ సెక్రటరీలు, గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతినెల మూడో శనివారం ' స్వచ్చాంధ్ర – స్వర్ణాంధ్ర ' కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఈనెల 15వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఇంకుడు గుంతల నిర్మాణ పనులను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మన జిల్లాలో సుమారు 15 వేల ఇంకుడుగుంతలు నిర్మించాలని లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. వీటి నిర్మాణ పరిమాణం, ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం, తదితర అంశాలను ఆమె వివరించారు. ఆయా విషయాలను లబ్ధిదారులకు తెలిపి, నిర్మాణానికి అవసరమైన సామాగ్రిని రెండు రోజుల్లో సమకూర్చుకొని, శనివారం జిల్లావ్యాప్తంగా ఈ పనులు ప్రారంభమయ్యేలా పర్యవేక్షించాలని డ్వామా అధికారులను ఆదేశించారు. తడిచెత్త, పొడిచెత్త, ప్రమాదకర వ్యర్థాలను ఇంటివద్దే వేరు చేసేలా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ చెప్పారు. ఇప్పటికే నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు అన్నింటినీ ఈనెల 15వ తేదీ నాటికి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవడంపై దృష్టి సారించాలని ఆదేశించారు. నిర్మాణంలో ఆగిపోయిన వాటిని పూర్తి చేయటంపైనా దృష్టి సారించాలన్నారు. బాల్య వివాహాలు, పోషకాహార లోపాలను నివారించడం కోసం 'బంగారు బాల్యం' కార్యక్రమంలో భాగంగా రూపొందించిన సర్వేను వెల్ఫేర్ అసిస్టెంట్లు, గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో డ్వామా పి డి జోసఫ్ కుమార్, డీపిఓ గొట్టిపాటి వెంకట నాయుడు, జెడ్పి సిఈఓ చిరంజీవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.





# ఘనంగా ఇరిగినేనికి నివాళులు అర్పించిన వార్డ్ మెంబర్ పిడుగు శ్రీనివాసులు

(షణ్ముఖ వెలుగు, పామూరు, ఫిబ్రవరి 12)

కనిగిరి నియోజకవర్గం పామూరు మండలంలోని మోపాడు గ్రామం నందు కీర్తిశేషులు కనిగిరి మాజీ ఎమ్మెల్యే ఇరిగినేని తిరుపతి నాయుడు 8వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పిడుగు శ్రీనివాసులు మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఏకైక వ్యక్తి ఇరిగినేని అని, రాజకీయాలలో మచ్చలేని నాయకుడిగా, మకుటం లేని మహారాజుగా పేరు ప్రఖ్యాతులుగాంచిన ఇరిగినేని జీవితం ఈనాటి రాజకీయ నాయకులకు ఆదర్శం అన్నారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయతతో అలగరించడం గొప్ప మనసు కల్లవాడు అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డివి మనోహర్, వాయినేని రాఘవ, అస్లిమ్, కావేరి రసూల్, గుత్తి మహేష్, తదితరులు పాల్గొన్నారు.



# ఆధ్యాత్మిక యాత్రలకు ఏపి టూరిజం పెద్దపీట

## కుంభమేళ యాత్రకు ఆంధ్రప్రదేశ్ టూరిజం కార్పొరేషన్ ప్రత్యేక బస్ సౌకర్యం

## ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో ఏపి టూరిజం అభివృద్ధి

## కుంభమేళ యాత్ర బస్సును ప్రారంభించిన ఏపి టూరిజం చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 12)**

ఆధ్యాత్మిక యాత్రలకు ఆంధ్రప్రదేశ్ టూరిజం ప్రత్యేక ప్యాకేజీ ఏర్పాటు చేసిందని ఏపి టూరిజం కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ తెలిపారు. ఉత్తర్ ప్రదేశ్ ప్రయగరాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళలో పాల్గొను యాత్రికుల సౌకర్యం కోసం ఆంధ్రప్రదేశ్ టూరిజం కార్పొరేషన్ రెండు ఏసి బస్‌లను ఏర్పాటు చేసిందని మొదటి బస్ నెల్లూరు నుండి ఒంగోలు విజయవాడ మీదగా రాజమండ్రి, విశాక పట్నం, ఒరిస్సా నుండి ఉత్తర్ ప్రదేశ్ లోని కాశీ,ప్రయగరాజ్,ఇతర తీర్థ యాత్ర దేవాలయాలకు భక్తుల కోసం వసతులు, ఆహారం సౌకర్యంతో మల్టీ యాక్సిల్ ఏ.సి బస్ ఈ రోజు ఒంగోలు నుండి టూరిజం కార్పొరేషన్ ట్రాన్స్పోర్ట్ జనరల్ మేనెజర్ శశిధర్ తో కలసి హొటల్ సరోవర్ వద్ద ప్రారంభించినట్లు డా. బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా డా బాలాజీ మీడియా తో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు ఆంధ్రప్రదేశ్ లోని ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలు ఆలయాలకు పర్యాటకులు, భక్తులు సందర్శించే విధంగా నూతన టూరిజం ప్యాకేజీలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు అలాగే తిరుపతి నుండి అరుణాచలం, తిరుపతి నుండి బెంగుళూరు, మైసూర్,ఊటి, తిరుపతి నుండి చెన్నై ఊటి, విశాఖపట్నం నుండి లంబసింగి, అరకు అన్నవరం సింహాచలం, శ్రీ శైలం, విజయవాడ మొదలగు ప్రాంతాలకు టూరిజం శాఖ తరపున బస్సులు, వసతి సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామని డాక్టర్ బాలాజీ తెలిపారు భారత దేశంలోనే ఆంధ్రప్రదేశ్ టూరిజం ఒక రోల్ మోడల్ గా ఉండే విధంగా టూరిజం కార్పొరేషన్ ని అభివృద్ధి చేస్తున్నట్టుగా డాక్టర్ బాలాజీ తెలిపారు టూరిజం శాఖ కందులు దుర్గేష్ గారి సలహాలు సూచన మేరకు ఆంధ్రప్రదేశ్ టూరిజం కార్పొరేషన్ అనేక కొత్త టూర్ ప్యాకేజీలు రానున్న వేసవి వేసవికాలంలో ఏర్పాటు చేసి పర్యాటకుల్ని ఆకర్షిస్తామని డాక్టర్ బాలాజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ టూరిజం కార్పొరేషన్ ట్రాన్స్పోర్ట్ జనరల్ మేనేజర్ శశిధర్, ఏపీ టూరిజం డివిజనల్ మేనేజర్ శ్రీనివాసరావు, ఏపీ టూరిజం సిఆర్ఎం టీవీఎస్ ప్రసాద్, ఏపీ టూరిజం పిఆర్ఓ వై రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.








# మంచిమనసు చాటుకున్న ఎమ్మెల్యే



**(షణ్ముఖ వెలుగు, కంభం, ఫిబ్రవరి 12)**

కంభం పట్టణంలోని ఎంపిడివో కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో భాగంగా కంభం పట్టణానికి చెందిన ఓ వృద్ధుడు అయ్యా నాకు భార్య, పిల్లలు లేరు నేను ఒంటరివాడిని నాకు పింఛన్ రావడంలేదు పూటగడవటానికి ఇబ్బందిగా ఉంది అని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని విన్నవించుకోగా ఆ వృద్ధుడిని చూసి ఎమ్మెల్యే చలించిపోయారు. వెంటనే తనకి పింఛన్ మంజూరు చేయాలని సంభంధిత అధికారులకు ఆదేశించారు. మీకు ప్రభుత్వం తరపు నుండి పింఛన్ వచ్చే వరకు తాను స్వయంగా మీకు ప్రతి నెల రూ.4వేల రూపాయలు నేను ఇస్తాను అని చెప్పి ఈ నెల పింఛన్ కింద నాలుగువేల రూపాయలు తన సొంత డబ్బులు ఆ వృద్ధుడికి అందజేసి గొప్పమనసు చాటుకున్నారు. ఇదంతా చూస్తున్న ప్రజలు ఎమ్మెల్యే గొప్పమనసుకి ప్రశంసలు కురిపించారు.

# ఉద్యోగులకు అండగా ఉంటా


## ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 12)**

విద్యుత్ శాఖలో పనిచేసే మీ అందరి సమస్యలను పరిష్కరించి మీకు అండగా ఉంటానని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్‌రావు స్పష్టం చేశారు. ఒంగోలులోని ఏపి ఎలక్ట్రసిటీ ఎంప్లాయిూస్ యూనియన్ (1104) జిల్లా కార్యాలయంలో జరిగిన ఎంప్లాయిూస్ యూనియన్ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో దామచర్ల ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అంతకు ముందుగా ఎంప్లాయిూస్ యూనియన్ ఆవిర్భవించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరం, రక్తదాన శిబిరాలను ప్రారంభించారు. అనంతరం సభను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజలు, ఉద్యోగుల శ్రేయస్సు కోరేది తెలుగుదేశం పార్టీ అన్నారు. తెలుగుదేశం అంటే అభివృద్ధి, అభివృద్ధి అంటే తెలుగుదేశం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధిలోకి తీసుకువెళుతున్నారని తెలిపారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మన ఇంట్లో మనిషిగా ఉంటారని, మీకు ఏ సమస్య ఉన్నా మాకు తెలియపరిస్తే వాటిని పరిష్కరిస్తానని దామచర్ల జనార్దన్ రావు హామీ ఇచ్చారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ఎవరిని ఇబ్బంది పెట్టే ప్రభుత్వం కాదన్నారు. గత ఐదేళ్లు రాష్ట్రంలో జరిగిన అవినీతి, దుర్మార్గం, దౌర్జన్యం తమ ప్రభుత్వంలో ఉండవన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్మిక పక్షపాతి అని కొనియాడారు. ప్రజా సమస్యలతోపాటు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ వేడుకల్లో విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కట్టా వెంకటేశ్వర్లు, ఏపిసిపిడీసీఎల్ డిస్కం సెక్రటరీ ఎన్ శర్మ, యూనియన్ రీజనల్ అధ్యక్షుడు సీహెచ్ హరికృష్ణ, రీజనల్ కార్యదర్శి ఆర్ సంజీవరావు, యూనియన్ జిల్లా నాయకులు, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.





# నాగభైరవ సాహిత్య పురస్కారానికి డాక్టర్ నూనె అంకమ్మరావు, డాక్టర్ శెట్లెం చంద్ర మోహన్‌లు ఎంపిక





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 12)**

ప్రముఖ సాహితీవేత్త,జాతీయ కవి,కవిరత్న కీ.శే డా. నాగభైరవ కోటేశ్వరరావు పేరిట ప్రతి సంవత్సరం ఇచ్చే సాహిత్య ప్రతిభా పురస్కారానికి ఒంగోలుకు సంబంధించిన కళామిత్రమండలి (తెలుగు లోగిలి) సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావును (2024), రెడ్డి బిఎడ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శెట్లెం చంద్ర మోహన్ (2025)లను ఎంపిక చేసినట్లు నాగభైరవ సాహిత్య పురస్కార కమిటీ చైర్మన్ సరస్వతీపుత్ర, కళారత్న డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు నుండి తమకు వర్తమానం అందిందని పురస్కార గ్రహీతలు అంకమ్మరావు, చంద్ర మోహన్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పురస్కారం ఈనెల 27వ తేదీన గుంటూరు బృందావన గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవాలయం ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదిక మీద జరిగే డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు సాహిత్య పురస్కార సభలో అతిథులుగా పాల్గొనే ప్రముఖ వైద్యులు, న్యాయవాది, రచయిత డాక్టర్ జక్కంపూడి సీతారామారావు, శాంతా కళాశాల అధినేత పెంట్యాల శ్రీమన్నారాయణ, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, దేవస్థానం పాలక మండలి అధ్యక్షులు చిటిపోతు మస్తానయ్య,నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు శ్రీమతి తేళ్ళ అరుణ, ప్రముఖ రచయిత మోదుగుల రవికృష్ణ, ప్రజా గాయకుడు నూకతోటి శరత్ బాబు, వారి కుటుంబ సభ్యులు సమక్షంలో పురస్కారాలతో పాటు నగదు బహుమతిని కూడా ప్రధానం చేస్తారని వారు తెలిపారు.

# రైతులు త్వరితగతిన ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలి

## ఏఓ వెంకటేష్




**(షణ్ముఖ వెలుగు, మద్రిపూడి, ఫిబ్రవరి 12)**

మండలంలోని ధర్మవరం, వెంకటకృష్ణాపురం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ మాట్లాడుతూ రైతులను




ఉద్దేశించి మండలంలోని రైతులందరూ త్వరితగతిన ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదయ్యి 11 అంకెల నెంబర్ను కలిగి ఉండాలని తెలియజేశారు. ఇది భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రాయితీలు, పథకాలు అందాలంటే తప్పనిసరిగా ఈ 11 అంకెల నెంబర్ను కలిగి ఉండాలని తెలియజేశారు. అదేవిధంగా రబీ కాలంలో పంట నమోదు చేసుకున్న రైతులంతా ఈకేవైసీకి వేలిముద్రలు వేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి కోటేశ్వరరావు, ఆత్మ బిటిఎం భూషణం, గ్రామ వ్యవసాయ సహాయకులు స్టీఫెన్, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# అర్థరాత్రి కూలిన మిద్దె తప్పిన ప్రమాధం





**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, ఫిబ్రవరి 12)**

యర్రగొండపాలెంలోని చాకలివారి వీధిలో అర్ధరాత్రి మిద్దె కూలడంతో నిద్రిస్తున్న బెల్లంకొండ రంగస్వామి, అంజలిలు శిధిలాలలో ఇరుక్కుపోయి ప్రమాదం నుండి బయటపడ్డారు. ఒక్క సారిగా పెద్ద శబ్దం రావడంతో చుట్టుప్రక్కలవారు వచ్చి వారిని బయటకు తీశారు. పాత మట్టిమిద్దె ఒక్కసారి కూలిపోవడంతో ఇంట్లోని సామాన్లు ద్వంసం అయ్యాయి. దీంతో ఆ దంపతులు బంధువుల ఇంటిలో తలదాచుకుంటున్నారు.



# పోలీస్ స్టేషన్‌లను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ ఏ ఆర్ దామోదర్





**పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలి**

**బ్లాక్ స్పాట్ల వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి**

**గ్రానైట్ క్వారీల్లో ప్రమాదాలు జరగకుండా భద్రతా ప్రమాణాలు పాటించేలా చూడాలి**

(షణ్ముఖ వెలుగు, సంతనూతలపాడు, చీమకుర్తి, ఫిబ్రవరి 12)

పోలీస్ స్టేషన్ స్థితిగతులు, సిబ్బంది పని తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించడానికి బుధవారం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ సంతనూతలపాడు, చీమకుర్తి పోలీస్ స్టేషన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసారు. ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలను, మహిళా సహాయక కేంద్రం, రికార్డ్ రూమ్, లాకప్ రూమ్, మెన్ వెయిటింగ్ హాల్, రైటర్ రూమ్, ఎస్ఐ రూమ్‌లను, చీమకుర్తి పాత పీఎస్ స్థలాన్ని పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో సీజ్ చేసిన వాహనాలు, వస్తువులు ఆరా తీసి వాటిని త్వరితగతిన డిస్పోసల్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్, నేర నియంత్రణ వ్యూహాలపై తీసుకుంటున్న చర్యలపై అధికారులను ఆరా తీసి పలు సూచనలు చేసారు. పోలీస్ స్టేషన్‌లో పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకొని వాటిని తక్షణమే విచారించి బాధితులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని, మహిళలు, చిన్నారులకు సంబంధించి వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రానైట్ క్వారీల్లో ప్రమాదాలు జరగకుండా భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ వాటిని అరికట్టాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడుతూ రోడ్డు భద్రత నియమాలు పాటించేలా చూడాలని, ప్రజలకు సిసి కెమెరాల పట్ల అవగాహన కల్పించి వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. పోలీసు స్టేషన్లలోని సిబ్బందితో మాట్లాడి వారి పని తీరు, వారు నిర్వహించే విధులు, ప్రస్తుత పరిస్థితులు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సాంకేతికను అందిపుచ్చుకోని నేరాలను ఛేదించాలని, ఆరోగ్యం పట్ల తగిన శ్రద్ధ చూపాలని, నీట్ టర్న్ అవుట్ లో ఉండాలని, స్టేషన్ ఆవరణలో పచ్చదనం పెంపొందించాలని, పోలీస్ స్టేషన్ కు వచ్చే పిటిషనర్ల పట్ల మర్యాదగా వ్యవహరించి వారి పిర్యాదుల పరిష్కారం జరిగేలా భరోసా కల్పించాలన్నారు. విధుల్లో ప్రతిభ చూపే వారికి తగిన గుర్తింపు, రివార్డ్స్ ఉంటాయన్నారు. అనంతరం సంతనూతలపాడు చెరువు మలుపు వద్ద రోడ్డు ప్రమాదాలు సంభావ్యత ఎక్కువగా ఉండే బ్లాక్ స్పాట్స్ ప్రాంతాలను ఎస్పీ పరిశీలించి, ప్రమాద ముఖ్య కారకాలను విశ్లేషించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వారికి పలు సూచనలు తెలియచేసినారు. బ్లాక్ స్పాట్ ఉన్న ప్రదేశాల వాహనాలు వేగాన్ని నియత్రించేలా స్పీడ్ బ్రేకర్స్, సుస్పష్టమైన సైన్ హెచ్చరిక బోర్డులు, మలుపుల వద్ద రేడియం బ్లింకర్స్, స్టిక్కర్స్ ఏర్పాటు చేయాలని, అలాగే రోడ్లపైకి వచ్చిన చెట్ల కొమ్మలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎస్పీ వెంట ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, ఎఆర్ డిఎస్పీ కె శ్రీనివాసరావు, ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్ బాబు, చీమకుర్తి సీఐ సుబ్బారావు, ఆర్ఐ సీతారామిరెడ్డి, సంతనూతలపాడు ఎస్ఐ అజయ్ బాబు, చీమకుర్తి ఎస్ఐ వెంకట కృష్ణయ్య, సిబ్బంది ఉన్నారు.









# ఘనంగా 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు

**కందుకూరు రవాణాశాఖ అధికాణి టీవీఎన్ లక్ష్మి**

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 12)

ప్రతి ఒక్క ఆటో కార్మికుడు డ్రైవింగ్ లైసెన్స్, ఆటో ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని కందుకూరు రవాణాశాఖ అధికారిణి టివిఎన్ లక్ష్మి అన్నారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా బుధవారం మండల కేంద్రమైన ఉలవపాడులో ట్రక్, ఆటో యూనియన్, ఆటో డ్రైవర్ సోదరులకు రహదారి భద్రతపై అవగాహన సదస్సును కార్యక్రమాన్ని ఉలవపాడు గ్రామంలోని మండల ట్రక్, ఆటో వర్కర్ యూనియన్ కార్యాలయం వద్ద కందుకూరు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి టీవీఎన్ లక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహిం. ఈ సందర్భంగా ఆమె ఆటో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్క డ్రైవర్ సోదరులు ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అదే విధంగా ఆటోలో పరిమితికి మించి ప్రజలను తీసుకొని వెళ్లవద్దని, సెల్ఫోన్ డ్రైవింగ్ చేయరాదని, ఆటో నడుపు వారు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకొని ఉండవలెనని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కందుకూరు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ చెన్నూరి రాంబాబు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనములు నడుపరాదని, ఆటో నడుపునప్పుడు తప్పనిసరిగా ఆటో యొక్క ధ్రువపత్రాలను ఫిట్నెస్, పర్మిట్ చెల్లుబాటు లో ఉండే విధంగా ఎప్పటికప్పుడు చూసుకోవాలని తెలియజేశారు. ఆటో సోదరులకి డ్రైవింగ్ లైసెన్స్, మీ వాహనాలకు సంబంధించిన ఏ సమస్య ఉన్నా నేరుగా కందుకూరు ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయానికి వచ్చి సంప్రదించి, మీ వాహనంకు సంబంధించిన పని చేయించుకోవచ్చని ఆటో కార్మికులకు తెలియజేశారు. అనంతరం ఉలవపాడు మండల





# వాహనాలు తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ బి రామకృష్ణరెడ్డి


(షణ్ముఖ వెలుగు, చీరాల, ఫిబ్రవరి 12)

36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా డిస్ట్రిక్ట్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ టికె పరంధామరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం చీరాలలో గల వివిధ స్కూల్, కళాశాలల వద్ద వాహన తనిఖీలు నిర్వహించి రాష్ గా వాహనాలను నడుపుతున్న వారి పైన మరియు సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్న వారి పైన అపరాధ రుసుము విధించడం జరిగిందని స్థానిక మోటారు వెహికిల్ ఇన్స్పెక్టర్ బి. రామ కృష్ణ రెడ్డి తెలిపారు. స్కూల్, కళాశాలల వద్ద వాహనాలను అధిక స్పీడ్ తో పాటు రాష్ గా నడుపుతున్నట్టు కంప్లయింట్ వస్తున్నాయని, అటు వంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. స్కూల్ కళాశాలల వద్ద విద్యార్థులు ఎక్కువగా రోడ్డు క్రాస్ చేయడానికి అవకాశం ఉంటుందని అటువంటి ప్రదేశాల్లో ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా వాహనాలను నెమ్మదిగా నడపాలని లేని యెడల చట్టాన్ని అతిక్రమించినట్లు అవుతుందని, ప్రమాదాలు జరగడానికి ఎక్కువ అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. కొన్ని స్కూల్ వద్ద స్కూల్ జోన్ బోర్డులు లేనట్లు తాము గుర్తించామని, అటువంటి ప్రదేశాల్లో సంబంధిత డిపార్ట్మెంట్ అధికారుల తో మాట్లాడి స్కూల్ జోన్ బోర్డులను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టూ వీలర్ నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఫోర్ వీలర్ నడిపే వారు సీటు బెల్టు పెట్టుకోవాలని కోరారు. ఇంకా ఈ తనిఖీలలో అసిస్టెంట్ మోటారు వాహన తనిఖీ అధికారులు పి అంకమ్మరావు, బి కిశోర్ బాబు, కె రవి నాయక్, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.





# దారపనేని క్యాంపు కార్యాలయంలో ఘనంగా ఇరిగినేనికి నివాళులు అర్పించిన దారపనేని




(షణ్ముఖ వెలుగు, పామూరు, ఫిబ్రవరి 12)

పామూరు పట్టణంలోని కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ క్యాంప్ ఆఫీసులో బుధవారం స్వర్గీయ కనిగిరి మాజీ ఎమ్మెల్యే ఇరిగినేని తిరుపతి నాయుడు 8వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దారపనేని మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఏకైక వ్యక్తి ఇరిగినేని అని, రాజకీయాలలో మచ్చలేని నాయకుడిగా, మకుటం లేని మహారాజుగా పేరు ప్రఖ్యాతులుగాంచిన ఇరిగినేని జీవితం ఈనాటి రాజకీయ నాయకులకు ఆదర్శం అన్నారు. పామూరు మాజీ సర్పంచ్ కావిటి వెంకటసుబ్బయ్య, టిన్ఎస్ వి జిల్లా మాజీ కార్యదర్శి పోక నాయుడు బాబు, నుచ్చు పొద ఫిషర్మెంట్ కమిటీ మాజీ అధ్యక్షులు కౌలూరి ఖాజా రహమతుల్లా, పామూరు మండల మాజీ కోఆప్షన్ సభ్యులు ఖాదర్ మొహిద్దిన్, దారపనేని నరసింహనాయుడు, మానం వెంగళరావు, నూతంగి నారాయణ, జాజం హరికృష్ణ నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

# బారాయిమామ్ కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఫిబ్రవరి 12)

కనిగిరి పట్టణంలోని టీడీపీ సీనియర్ నాయకుడు మాజీ కౌన్సిలర్ జిలాని తండ్రి బారాయిమామ్ ఇటీవల అకాలమరణం చెందిన విషయం విదితమే. బుధవారం కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు బారాయిమామ్ గృహానికి వెళ్లి వారి కుమారుడు మాజీ కౌన్సిలర్ జిలానిని పరామర్శించారు. టీడీపీలో తన వెన్నంటే ఉండి తన విజయానికి కృషి చేసారని ఈ సంధర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ షేక్ జిలాని, మాజీ కౌన్సిలర్ ఫయాజ్, మస్తాన్ వలి, భాస్కర్, మీరావలి, నాగుర్ వలి, రహిమాన్, బాబు, షరీఫ్, భారతి, తదితరులు పాల్గొన్నారు.



On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com